జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

సంపుటి 12 సంచిక 162 విశాఖపట్నం | గురువారం 25 ఫిబ్రవరి 2021 | 8 పేజీలు | వెల : 5.00



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523


# వ్యాపారాలతో ప్రభుత్వాలకేం పని?

## ప్రధానమంత్రి నరేంద్రమోదీ



**న్యూఢిల్లీ, ప్రజాపాలన :** వ్యాపారంతో ప్రభుత్వానికి సంబంధం లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రభుత్వం దృష్టి ప్రజా సంక్షేమంపైనే ఉండాలన్నారు. పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) నిర్వహించిన వెబినార్‌లో బుధవారం మాట్లాడుతూ, 2021-22 ఆర్థిక సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన సంస్కరణల గురించి వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం తప్పనిసరి అని మోదీ తెలిపారు. 'మోనిటైజ్ అండ్ మోడర్నైజ్' అనే మంత్రంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వం మోనిటైజ్ (నగదు రూపంలోకి మార్చడం) చేస్తే, ఆ స్థానంలోకి ప్రైవేటు రంగం వస్తుందన్నారు. ప్రైవేటు రంగం వస్తే పెట్టుబడులు వస్తాయని, అత్యుత్తమ స్థాయి అంతర్జాతీయ విధానాలు అమల్లోకి వస్తాయని చెప్పారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాల్లో నడుస్తున్నాయన్నారు. వీటి కోసం పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఖర్చు పెట్టవలసి వస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేవలం వారసత్వాన్ని కొనసాగించడం కోసం నడపకూడదన్నారు. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలకు ఆర్థిక సహకారం అందించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై భారం పడుతోందని చెప్పారు. ప్రైవేటు రంగం వల్ల సమర్థత పెరుగుతుందని, ఉద్యోగావకాశాలు కొత్తగా వస్తాయని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటైజేషన్ చేయడం వల్ల వచ్చిన సొమ్మును ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేస్తామని చెప్పారు. అనేక ప్రభుత్వ ఆస్తులు వాటి సామర్థ్యానికి తగినట్లు పని చేయడం లేదని తెలిపారు. వీటిని మానిటైజ్ చేసి రూ. 2.5 లక్షల కోట్లు సేకరిస్తామని చెప్పారు. నాలుగు వ్యూహాత్మక రంగాలు మినహా మిగిలిన అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడానికి మిగతా 2లో..

రేపటి తెలంగాణ మాక్ అసెంబ్లీకి

# సర్వం సిద్ధం

- తెలంగాణలో బహుజనుల జనాభా అధికం వారి అభివృద్ధి శూన్యం
- తెలంగాణలోని బహుజనుల సమస్యలే ప్రధాన ఎజెండా
- రాజ్యాధికార సాధనే మా లక్ష్యం

**హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ లో జరిగిన బహుజన మాక్ అసెంబ్లీ విజయవంతం కావడంతో బహుజనుల జనాభా అధికంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఆత్మగౌరవ పరిరక్షణే మన లక్ష్యం అన్న నినాదంతో తమ తదుపరి మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెపుతున్న అంబేద్కర్ రాజనీతి మూవ్ మెంట్ వారు,పూలే,అంబేద్కర్ రాజ్యాధికార సమితి,స్నేహ సంస్థలు రేపు హైదరాబాద్ రవీంద్రభారతిలో మాక్ అసెంబ్లీ కార్యక్రామాన్ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బహుజన జనాభా అధికంగా ఉన్నాకూడా ఇంకా ఇప్పటికీ బహుజనుల సమస్యలు తీర్చాలంటూ ప్రభుత్వానికి మెమోరాండం లు సమర్పించే దుస్థితి మారాలి. బహుజనులకే రాజ్యాధికారం దక్కాలి అనే తలంపుతో ఈ మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని తలపెట్టిన నిర్వాహకులకు సర్వత్రా విశేషం గా మద్దతు దొరకడం అభినందనీయం.

**అసలేంటి ఈ మాక్ అసెంబ్లీ అంటే....**

అసెంబ్లీ అంటే శాసనాలను తయారు చేసి, వాటి అమలుకై కృషి చేసే ప్రజాప్రతినిధుల సభ ,ఒక రకం గా చెప్పాలంటే రాష్ట్ర భవిష్యత్తుని నిర్మించడానికి ప్రజలు ప్రజాప్రతినిధులకు అవకాశంగా ఇచ్చిన వేదిక, నిస్వార్థంగా,నిజాయితీగా ఉన్న ప్రజాప్రతినిధులు దీన్నొక దేవాలయంగా భావిస్తారు.మరి అలాంటి చోట మన తెలంగాణ రాష్ట్రంలో అధికంగా ఉన్న మన బహుజన ప్రజాప్రతినిధులు మన బహుజన సమస్యలు పరిష్కరించడంలో ఎంత వరకు సఫలీకృతం అవుతున్నారు అన్నదానికి దృశ్యరూపమే ఈ మాక్ అసెంబ్లీ. అంబేద్కర్ రాజనీతి మూవ్ మెంట్ వారు,పూలే,అంబేద్కర్ రాజ్యాధికార సమితి,స్నేహ సంస్థలు సంయుక్తంగా ఈ మాక్ అసెంబ్లీని నిర్వహిస్తున్నారు. ప్రతీ రాష్ట్రానికి ఒక శాసన సభ , శాసన మండలి ఉంటాయి. రాష్ట్రాన్ని పరిపాలించడానికి చేయాల్సిన శాసనాలను, రాష్ట్రంలో ఉన్న ప్రజా సమస్యలపై చర్చించడానికి మన రాజ్యాంగం ప్రజాప్రతినిధులకు ఇచ్చిన వేదిక నే ఈ శాసనసభ(అసెంబ్లీ)అంటారు.ఈ అసెంబ్లీ ని నిర్వహించడానికి ఒక స్పీకర్, అధికారపక్ష నేత అంటే ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారపక్ష సభ్యులు, ప్రతిపక్ష నాయకుడు, సభ్యులు, మిగతా పార్టీల సభ్యులు ఎలా ఉంటారో ఆలాంటి వారిని బహుజన నాయకులతో బహుజనులకు వారి సమస్యలపై పోరాడడంలో ఎంత వరకు సఫలీకృతం అవుతున్నారో ప్రజలందరికీ ఒక దృశ్యరూపంగా మలచి ఏయే ప్రజాప్రతినిది చర్చల్లో మిగతా 2లో..

# ఎక్కడా రాజీ పడొద్దు



## పక్కా భవనాలు కట్టించాలి
## మన బడి నాడు- నేడు కార్యక్రమంపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష

**అమరావతి, ఫిబ్రవరి 24 (ప్రజాపాలన) :** విద్యాకానుకలో ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీని చేర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠ్యపుస్తకాల నాణ్యత బాగుండాలని, విద్యార్థులకు ఏర్పాటు చేసే బెంచ్‌లు సౌకర్యవంతంగా ఉండాలని పేర్కొన్నారు. మనబడి నాడు-నేడు కార్యక్రమంపై సీఎం వైఎస్ జగన్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మొదటి దశ నాడు-నేడు పనులు మార్చికల్లా పూర్తి చేయాలి. స్కూళ్ళు కలర్‌ఫుల్‌గా మంచి డిజైన్లతో ఉండాలి. స్కూళ్ళలో ఇంటీరియర్ కూడా బావుండాలి. రెండో దశలో మరింత మార్పులు చేయాలి, విద్యార్థులకు ఏర్పాటుచేసే బెంచ్‌లు సౌకర్యవంతంగా ఉండాలి. పనుల్లో ఎక్కడా నాణ్యతా లోపం రాకూడదు. మనసా వాచా కర్మణ నిబద్ధతతో పనిచేయాలి. అప్పుడే మనం అనుకున్న ఫలితాలు సాధిస్తాం. టేబుల్స్ విషయంలో మరింత జాగ్రత్త అవసరం, టేబుల్స్ హైట్ కూడా చూసుకోవాలి. ఇక వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడో తరగతి వరకు సీబీఎస్ఈ విధానంలో బోధన జరగాలి. ఆ తర్వాత ఏటా ఒక్కో తరగతికి పెంచుతూ పోవాలి.అలా 2024 నాటికి 10వ తరగతి వరకు సీబీఎస్ఈ విధానం అమలు చేయాలి" అని మార్గనిర్దేశం చేశారు. అదే విధంగా 390 పాఠశాలల భవన నిర్మాణానికి సంబంధించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్, పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ వాడ్రేవు చినవీరభద్రుడు, సమగ్రశిక్షా అభియాన్ ఎస్‌పిడి వెట్రిసెల్వి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**పక్కా భవనాల్లో ప్రభుత్వ పాఠశాలలు**

"ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు లేని పరిస్థితి ఎక్కడా ఉండకూడదు. కచ్చితంగా భవనాలు కట్టించాలి. నాడు - నేడులో భాగంగా ఆ పాఠశాలలన్నింటికీ భవన నిర్మాణాలు శరవేగంగా జరగాలి. రాష్ట్రవ్యాప్తంగా పక్కా భవనాలు లేని 390 పాఠశాలలకు భవనాల నిర్మాణం చేపట్టాలి" అని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రత స్కూళ్లలో టాయిలెట్ల శుభ్రతపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, ఇప్పటికే 27వేల మంది ఆయాలను నియమించామని అధికారులు మిగతా 2లో..


# చెప్పాడంటే చేస్తాడు అదే సీఎం జగన్ నైజం

## మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పేర్ని నాని



**అమరావతి, ప్రజాపాలన :** 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల క్యాలండర్‌ను మంగళవారం ఏపీ మంత్రివర్గం ఆమోదించిందని సమాచార శాఖ మంత్రి పేర్ని నాని తెలిపారు. చెప్పాడంటే చేస్తాడంతే అని పేరు సీఎం జగన్ పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఏ నెలలో ఏ పథకం అమలవుతుందనే అంశాన్ని తెలిపేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. మంత్రివర్గ సమావేశ నిర్ణయాలపై మంత్రి బుధవారం మీడియాకు వివరించారు. దుర్గ గుడిలో అవినీతి నిరోధక శాఖ

# ముందుకు రానీ బీజేపీ.. పుదుచ్చేరిలో రాష్ట్రపతి పాలన



**పుదుచ్చేరి, ప్రజాపాలన :** కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో నారాయణ స్వామి ప్రభుత్వం కూలిపోయిన అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ సహా మరే ఇతర పార్టీ ముందుకు రాకపోవడంతో రాష్ట్రపతి పాలన విధించాలని లెఫ్టినెంట్ గవర్నర్ సౌందర్యరాజన్ తమిళిసై ప్రతిపాదించారు. కాగా ఈ ప్రతిపాదనకు కేంద్ర క్యాబినేట్ బుధవారం ఆమోదం తెలిపింది. అనంతరమే పుదుచ్చేరిలో రాష్ట్రపతి పాలన ప్రారంభమైంది. నారాయణ స్వామి ప్రభుత్వం కూలిపోయిన అనంతరం నుంచే పుదుచ్చేరిలో రాష్ట్రపతి పాలన రానుందని ఊహాగానాలు వెలువడ్డాయి. వాటికి అనుగునంగా కేంద్ర ప్రభుత్వానికి లెఫ్టినెంట్ మిగతా 2లో..

# పెద్ద ఎత్తున అల్లర్లు సృష్టించే వ్యక్తి మోదీ : దీదీ ఫైర్



**కోల్‌కతా, ప్రజాపాలన :** ప్రధాని నరేంద్ర మోదీపై సీఎం మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ పెద్ద ఎత్తున అల్లర్లు సృష్టించే వ్యక్తి అంటూ తీవ్రంగా విరుచుకుపడ్డారు. హుగ్లీలోని షాన్ గంజ్ సభలో ఆమె ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా ద్వయం విపరీతమైన అబద్ధాలను ప్రచారం చేస్తూ, దేశ వ్యాప్తంగా విద్వేషాన్ని పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. "ప్రధాని మోదీ అల్లర్లు సృష్టించే వ్యక్తి. అల్లర్ల ద్వారా ట్రంప్ సాధించిందేమి? అంతకంటే ఘోరమైన ఇబ్బందులను మోదీ ఎదుర్కొంటారు. హింస ద్వారా సాధించేది ఏమీ లేదు." అని మమత వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో తామే గోల్‌కీపర్లమని, బీజేపీ ఒక్క గోల్‌నూ సాధించలేదని ధీమా వ్యక్తం చేశారు. బొగ్గు కుంభకోణంలో సీబీఐ ఎంపీ అభిషేక్ భార్యకు నోటీసులు జారీ చేయడమంటే మహిళలను అవమానించడమే అవుతుందని విమర్శించారు. "నన్ను చంపండి. కొట్టండి. అంతేగానీ మిగతా 2లో..




# ఎక్కడా రాజీ పడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రికి తెలిపారు. మార్చి మొదటివారంలో వీరందరికీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరికరాలు, పరిశుభ్రంగా ఉంచేందుకు లిక్విడ్స్ అన్నీ స్కూళ్లకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**విద్యార్థుల హాజరుపై ఆరా**

విద్యార్థుల హాజరుకు సంబంధించి తల్లులు, ఎడ్యుకేషన్ సెక్రటరీలు, వాలంటీర్ల మ్యాపింగ్ ప్రక్రియ నడుస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు స్పందించిన అధికారులు మార్చి 15 కల్లా పూర్తిచేస్తామని తెలిపారు.

**ఎక్కడా రాజీ పడొద్దు: విద్యాకానుకపై సీఎం**

విద్యాకానుకలో ఇంగ్లిషు – తెలుగు డిక్షనరీని చేర్చాలి. అలాగే పాఠ్యపుస్తకాలు కూడా క్వాలిటీగా ఉండాలి. ప్రైవేటు స్కూళ్లలో ఇస్తున్న పుస్తకాల నాణ్యతతో పోటీగా ఉండాలి. ఎక్కడా కూడా రాజీపడొదద్దు. టీచర్లకూ డిక్షనరీలు ఇవ్వాలి. అమ్మ ఒడి కింద ఆప్షన్ తీసుకున్న విద్యార్థులకు ఇచ్చే ల్యాప్‌టాప్‌లు క్వాలిటీ, సర్వీస్ ముఖ్యం.

**అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ**

అంగన్ వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ప్రతి రెండు నెలలకోసారి వారు ఎంతవరకు నేర్చుకున్నారన్నదానిపై ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలో ఉత్తీర్ణులు అయ్యారా? లేదా? అన్నదానితో సంబంధం లేకుండా వారు ఎంతవరకు శిక్షణ కార్యక్రమాల ద్వారా అప్‌గ్రేడ్ అయ్యారో పరిశీలించి, మరింతగా వారికి ట్రైనింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు.

# చెప్పాడంటే చేస్తాడు అదే సీఎం జగన్ నైజం

(మొదటిపేజీ తరువాయి)

దాడులు చేస్తే రాష్ట్ర మంత్రి వెల్లంపల్లిపై ఆరోపణలు చేయడం శోచనీయమని మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. అక్రమాలు సహించమని మా ప్రభుత్వం చెబుతున్నామని.. తనిఖీలు కూడా మేమే చేయిస్తుంటే రాజకీయ ఆరోపణలు చేయడం దారుణమని మండిపడ్డారు. వెల్లంపల్లిపై దారుణమైన ఆరోపణలు మానుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు.

గతంలో ఓ చీఫ్ ఇంజినీర్‌పై ఏసీబీ దాడులు చేస్తే అప్పటి మంత్రికి వాటిని అంటగట్టామా అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కోలేక పార్టీలు చేస్తున్న ఆరోపణలు ఇవి అని మంత్రి పేర్ని నాని కొట్టిపారేశారు. ఈ సందర్భంగా మంత్రివర్గం ఆమోదించిన సంక్షేమ క్యాలెండర్ వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

ఏప్రిల్: వసతి దీవెన, విద్యాదీవెన, రైతులకు, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ అమలు

మే: మత్స్యకార భరోసా

జూన్: వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యా కానుక అమలు

జూలై: వైఎస్సార్ వాహన మిత్ర పథకం

ఆగస్టు: నేతన్న నేస్తం, అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం

సెప్టెంబర్: వైఎస్సార్ ఆసరా

అక్టోబర్: రైతు భరోసా రెండో విడత, చేదోడు, తోడు పథకాల అమలు

నవంబర్: కొత్తగా ఆమోదించిన ఈబీసీ నేస్తం

డిసెంబర్: విద్యాదీవెన, వసతి దీవెన రెండు, మూడో విడత అమలు, లా నేస్తం

2022 జనవరి: రైతు భరోసా మూడో విడత, అమ్మఒడి, పింఛన్ 2,500కు పెంపు

# వ్యాపారాలతో ప్రభుత్వాలకేం పని?

(మొదటిపేజీ తరువాయి)

తన ప్రభుత్వంకట్టుబడిఉం దని తెలిపారు. ప్రభుత్వం వ్యాపారం చేస్తే, ఆ వ్యాపారం నష్టాలకు దారి తీస్తుందన్నారు. ప్రభుత్వం నియమ, నిబంధనలకు కట్టుబడి ఉంటుందని, సాహసోపేతమైన వ్యాపార నిర్ణయాలు తీసుకునే ధైర్యం ఉండదని వివరించారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరించి, పెట్టుబడులను ఉపసంహరించడం వల్ల వచ్చిన సొమ్మును అభివృద్ధి పథకాల కోసం ఖర్చు చేస్తామన్నారు. ఆస్తులను నగదుగా మార్చడం, ప్రైవేటీకరించడానికి తీసుకున్న నిర్ణయాలు భారతీయులను సాధికారులుగా మార్చడానికి దోహదపడతాయన్నారు.

# రేపటి తెలంగాణ మాక్ అసెంబ్లీకి సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఎలా స్పందిస్తున్నారో కంటికి కట్టినట్లు చూపించడమే ఈ మాక్ అసెంబ్లీ. మన అసెంబ్లీ లో జరిగిన విధంగా వాడీ వేడి చర్చలు, వాకౌట్లు,ప్రశ్నోత్తరాల సమయాలు లాంటివి చూపుతూనే బహుజన నాయకులు ప్రజాప్రతినిధులు గా బహుజనుల కొరకు ఏం చేస్తే బహుజనాభివృద్ధి సాధ్యమో వాటిని ఈ మాక్ అసెంబ్లీలో బిల్లులుగా ప్రతిపాదిస్తారు. సభాకార్యక్రమాలు, సభాసాంప్రదాయాలు అందులో మన బహుజన నాయకులకు దక్కుతున్న అవకాశాలు ఎంత అనేది ప్రత్యక్షంగా కనిపిస్తుంది.

**ఎంత మంది పాల్గొంటారు?**

తెలంగాణ కి సంబంధించి అసెంబ్లీ లో ప్రజాప్రతినిధులు 119 మంది ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ లు,ప్రత్యేకంగా కొంతమంది ఎస్ సి ఎమ్మెల్యేలు, ఎస్ టి ఎమ్మెల్యేలు,ముస్లింలు,క్రిస్టియన్ లు,బుద్ధిస్ట్ లు పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ రాజనీతి మూవ్ మెంట్,పూలే,అంబేద్కర్ రాజ్యాధికార సమితి ,స్నేహా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. స్వార్థంగా,బహుజనోద్ధరణకు, బహుజనులకు రాజ్యాధికారం లక్ష్యంగా తలపెట్టిన ఇటువంటి గొప్ప కార్యక్రమాలకు బహుజనులు పెద్ద ఎత్తున పాల్గొని ఇలాంటి బహుజనుల మేలు కోరే వారికి సహకరిద్దాం, వీలయినంతగా తోడ్పాటును అందిద్దాం.

# ఎన్నికల నిర్వహణలో ఆర్‌ఓలు, ఏ ఆర్ ఓ లు, బిఎల్‌ఓలు, నోడల్ ఆఫీసర్లు పాత్ర కీలకం

- నగరపాలక లో 50 వార్డుల్లో 249 పోలింగ్ కేంద్రాలు
- మొత్తం ఓటర్లు 2, 66,762
- మహిళలు 1,34,170 మంది పురుషులు 1,32,540 మంది ఇతరులు 52 మంది
- కమిషనర్ గిరీష ఆదేశం

**తిరుపతి, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన) :** నగరపాలక సంస్థ పరిధిలో 50 వార్డులలో 249 పోలింగ్ కేంద్రాలు 13 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు, 25 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఆఫీసర్లు, నాలుగు మంది రిజర్వ్ ఆర్ ఓ లు, నలుగురు రిజర్వ్ ఏ ఆర్ ఓ లు , నోడల్ ఆఫీసర్లు, బి ఎల్ వో లు, మహిళా సంరక్షణలు, కార్యదర్శులు ఉంటారని, ఈసారికి ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరగనుండటంతో పోలింగ్ కేంద్రాలలో వృద్ధులకి, వికలాంగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారికి అనువుగా( మౌలిక కార్యక్రమం దృష్టి సారించాలని) పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాటు చేసుకోవాలి అని అధికారులు కమిషనర్ గిరీష ఆదేశించారు. మునిసిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ గిరీష బుధవారం ఉదయం నగరపాలక వై.ఎస్.ఆర్ సమావేశ మందిరంలో నగరపాలక ఎన్నికల పోలింగ్ కేంద్రాలను గురించి అధికారులకు అవగాహన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ లోని 50 వార్డులలో 249 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. మునిసిపల్ ఎన్నికల నిర్వహణ శరవేగంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని అందులో భాగంగానే మన నగరపాలక సంస్థ లో కూడా ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితాను, అలాగే వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల జాభితా కూడా ప్రచురించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో నగరం లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల కల్పనకై పోలింగ్ కేంద్రాలను గతవారం పరిశీలించడం జరిగిందన్నారు. నాలుగు వార్డుల కు సంబంధించి ఒక్కొక్క రిటర్నింగ్ ఆఫీసర్ ను నియమించి, వారికి ఎన్నికలకు సంబంధించి న బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వృద్ధులకు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని మరియు విద్యుత్ సదుపాయం, మరుగు దొడ్లు, వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చూసుకోవాలని, పోలింగ్ కేంద్రాల్లో వసతి కల్పనకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ముగిసేవరకు అధికారులు అందుబాటులో ఉండాలని, ప్రతిరోజు సమీక్ష లో పాల్గొనాలని,ఈ వారం లోపల ఎన్నికల సంబంధించి శిక్షణా కార్యక్రమం ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో కమిషనర్ వారితోపాటు అదనపు కమిషనర్ హరిత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, సూపరిడెంట్ ఇంజనీర్ మోహన్, ఆరోగ్య అధికారి సుధా రాణి, యం.ఈ.లు చంద్రశేఖర్, వెంకట్ రామ్ రెడ్డి, డి.ఈ.లు రఘు కుమార్, రవీంద్రనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, దేవిక, గోమతి, మేనేజర్ హానిఫ్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, గాలిసుధాకర్, బి ఎల్ వో లు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మరో ప్రయోగానికి ఇస్రో సిద్ధం



**నెల్లూరు ఫిబ్రవరి 25 (ప్రజాపాలన) :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతుంది. పూర్తి స్థాయి వాణిజ్జ ఒప్పందాలతో పీఎస్ ఎల్వీ– సీ 51 రాకెట్ ప్రయోగాన్ని నిర్వహించడానికి సర్వం సిద్ధం చేసింది. నెల్లూరు జిల్లా లోని శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుండి ఈ ప్రయోగం జరుగుతుంది. వరుస విజయాలతో ముందుకు పోతున్న ఇస్రో ఇప్పుడు మరో ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి ఈ నెల 28 వ తేదీ ఉందయం 10 :24 నిమిషాలకు సీఎస్ఎల్వీ సీ 51 రాకెట్ ద్వారా 19 ఉపగ్రహాలను ప్రయోగించనున్నది . ఇది పూర్తిగా ఇస్రో వాణిజ్య ఒప్పందాలతో ప్రయోగిస్తున్న మొదటి రాకెట్ ప్రయోగం. భారత్ కు చెందిన వివిధ కళాశాలలకు చెందిన 5 ఉపగ్రహాలు,అమెరికాకు చెందిన 13 ఉపగ్రహాలతో పాటు బ్రెజిల్ కు చెందిన మరో ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. ఇవన్నీ ప్రవేటు సంస్థల ప్రయోజనాలకోసం వాణిజ్య పరంగా ప్రయోగించే ఉపగ్రహాలు.

ఈ ప్రయోగం లో ప్రధానముగా బ్రెజిల్ కు చెందిన అమోజోనియా -1 మిషన్ అనే ఉపగ్రహం ఉంది.దీని బరువు 637 కిలోలు. ఇది 4 సంవత్సరాల పాటు పని చేస్తుంది.దీంతో పా టుగా సతీష్ ధావన్ శాట్, యూని టీ శాట్‌లు మూడు , సిందునేత్ర అనే ఉపగ్రహాల తో పాటు అమెరి కా కు చెందిన సాల్ -1 నానో కనెక్ట్-2 ఉపగ్రహం మరో 12 బీఈఈఎస్ ఉపపగ్రహాలను కూడా ఇస్రో ఒకే రాకెట్ ద్వారా ప్రయోగి స్తోంది. ప్రయోగం తరువాత మొదటి 17 నిమిషాల తరువాత బ్రెజిల్ కు చెందిన ఆమెజోనియా ఉపగ్రహాన్ని కక్షలోకి వదులు తుంది. తరువాత గంటా 55 నిమిషాల పాటు ప్రయాణం చేసి మిగిలిన 18 ఉపగ్రహాలను కక్షలో నిలపడం జరుగుతుంది.

పీఎస్ ఎల్వీ సీ–51 1 ఇస్రో చరిత్రలో 53 రాకెట్ ఇప్పటి దాకా షార్ నుండి ఇస్రో 78 రాకెట్ ప్రయో గాలను చేపట్టింది. , అలాగే ఇప్పటి దాకా ఇస్రో 34 దేశాలకు సంబం దించిన 342 ఉపగ్రహాలను వాణిజ్య ఒప్పందాల ద్వారా ప్రయోగించింది.

# విజయసాయిరెడ్డి పాదయాత్రలో చోరీ?.. అరెస్ట్

**విశాఖపట్నం ఫిబ్రవరి 25 (ప్రజా పాలన) :** ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విజయసాయిరెడ్డి చేపట్టిన పాదయాత్రలో పలు చోరీకి పాల్పడిన నిందుతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ నాయకులు ఈ నెల 20న నగరం లో నిర్వహించిన పాదయాత్ర లో జేబు దొంగతనాలకు పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు క్రైమ్ డీసీపీ వి.సురేశ్బాబు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్ర హం నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు నిర్వ హించిన పాదయాత్రలో ద్వారకానగర్, తాటిచెట్లపాలెం, ఊర్వశి జంక్షన్, మద్రిపాలెం , ఎన్ఏడీ జంక్షన్ తదితర ప్రాంతాల్లో మనీ పర్సులు చోరీకి గురయ్యాయన్నారు. సుమారు 3,03,500 రూపాయిలు దొంగతనం జరిగినట్టు పలువురి నుంచి ఫిర్యాదులు రావడంతో అల్లిపురానికి చెందిన కింతలి రవికుమార్ను విచారించగా, జేబు దొంగల ముఠా గుట్టు రట్టైంద న్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఇట్టా బాలాజీ, పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన పేరుపు దుర్గాప్రసాధ్, కృష్ణా జిల్లా నందిగామకు చెందిన కనగల శ్రీనివాస్లను అదుపులోకి తీసుకుని విచారణ జరపగా, వీరు నలుగురు నేరం అంగీకరించారని వివరించారు. నిందితుల నుంచి 2,80,000 స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు తెలిపారు.

# పెద్ద ఎత్తున అల్లర్లు సృష్టించే వ్యక్తి మోదీ

(మొదటిపేజీ తరువాయి)

మా కోడలిని అవమానపరుస్తారా? బొగ్గు దొంగ అని విమర్శిస్తారా? మమ్మల్ని బొగ్గు దొంగ అని పిలుస్తారా? మీరేమైనా మచ్చలేని వారా? మీ గురించి మాకన్నీ తెలుసు. కానీ అంత కింది స్థాయికి నేను దిగలేను." అని ఘాటుగా విమర్శించారు మమత. దేశాన్ని బెంగాలీలతో పాటు ఇతరులు కూడా పాలించారని, ఇతరులు బెంగాలీల వెన్నెముకలను తుంచడానికి ప్రయత్నించాని విమర్శించారు. వారు బెంగాల్‌ను పాలించడానికి చూస్తున్నారని, బెంగాల్‌ను బెంగాల్ లాగా ఉంచాలని, బీజేపీ బెంగాల్‌ను ఏం చేయాలనుకుంటోందో చెప్పాలని ఘాటుగా నిలదీశారు. గుజరాతీలు బెంగాల్‌ను ఎన్నడూ పరిపాలించలేరని పరోక్షంగా మోదీ,షా ద్వయంపై ఆమె విరుచుకుపడ్డారు.

**బీజేపీని బెంగాల్‌లో ఓడగొడితే...**

వచ్చే ఎన్నికల్లో బీజేపీని బెంగాల్‌లో చిత్తుచిత్తుగా ఓడగొడితే... దేశం నలుమూలలా బీజేపీని ఓడించడం అసాధ్యమేమీ కాదని మమత పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చాలా అభివృద్ధి పనులు చేశామని, మోదీ చేసిందేమో చెప్పాలని సవాల్ విసిరారు. తమను పాతిపెట్టినా సరే.... మళ్లీ చెట్టులా పెరుగుతూనే ఉంటానని ఆమె ప్రకటించారు. "నన్ను పాతిపెట్టినా చెట్టులా విస్తరిస్తూనే ఉంటా. ఆట మొదలైంది. గాయపడిన పులి చాలా ప్రమాదకారి. బెంగాల్‌లో బీజేపీని ఓడిస్తే.. భారత రాజకీయ చిత్రపటంపై కనుమరుగవుతుంది. ఇది ఖాయం." అని మమత ఓటర్లకు పిలుపునిచ్చారు.

# కుప్పంలో టెన్షన్ వాతావరణం

**చిత్తూరు, ప్రజాపాలన :** కుప్పంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. నిన్న రాత్రి టీడీపీ నేతల ఫ్లెక్సీలను వైసీపీ కార్యకర్తలు దగ్ధం చేశారు. కుప్పంలో చంద్రబాబు గురువారం నుంచి మూడు రోజుల పర్యటన నేపథ్యంలో బాబు పర్యటనను అడ్డుకుంటామని వైసీపీ నేతలు హెచ్చరించారు. నిన్న రాత్రి టీడీపీ నాయకుల ఫ్లెక్సీలను వైసీపీ కార్యకర్తలు దగ్ధం చేయడంతో కుప్పంలో ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

# ముందుకు రానీ బీజేపీ.. పుదుచ్చేరిలో రాష్ట్రపతి పాలన

(మొదటిపేజీ తరువాయి)

గవర్నర్ ప్రతిపాదనలు పంపడం.. ఆ ప్రతిపాదనను కేంద్ర కేబినేట్ ఆమోదించడం చకచకా జరిగిపోయాయి. పుదుచ్చేరిలో నారాయణస్వామి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోలేక.. ముఖ్యమంత్రి పదవికి నారాయణస్వామి సోమవారం రాజీనామా చేశారు. 33 మంది ఎమ్మెల్యేలున్న అసెంబ్లీలో ఒక ఎమ్మెల్యేపై అనర్హత వేటు, ఐదుగురు ఎమ్మెల్యేల రాజీనామాతో కాంగ్రెస–డీఎంకే కూటమికి స్పీకర్‌తో కలిపి 12 మందే మిగిలారు. వీరిలో ఒక స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు. మరోవైపు ఏడుగురు ఎన్ఆర్ కాంగ్రెస్, నలుగురు అన్నాడీఎంకే, ముగ్గురు బీజేపీ నామినేటెడ్ ఎమ్మెల్యేలతో కలిపి ప్రతిపక్ష కూటమికి 14 మంది ఎమ్మెల్యేలున్నారు. బలపరీక్షలో ముగ్గురు నామినేటెడ్ బీజేపీ సభ్యులకు ఓటేసే హక్కు లేదని సోమవారం నాటి అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వ విప్ అనంతరామన్ చెప్పినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ పట్టించుకోలేదు. దీంతో సీఎం నారాయణస్వామి అసెంబ్లీ నుంచి బయటికి వెళ్లిపోయారు. మంత్రులు, అధికార పక్షం ఎమ్మెల్యేలూ ఆయన వెంటే బయటికి వెళ్లిపోవడంతో ప్రభుత్వం బలపరీక్షలో విఫలమైందని స్పీకర్‌ప్రకటించారు. అసెంబ్లీ నుంచి రాజ్‌నివాసకు వెళ్లిన నారాయణస్వామి ఎల్‌జీకి రాజీనామాపత్రాన్ని అందించారు. స్పీకర్ సభానిబంధనలను పాటించలేదని ఆయన ఆరోపించారు.

# ప్రభుత్వ లక్షాలకు అనుగుణంగా పని చెయ్యాలి

ఎమ్మెల్యే రోజా

**చిత్తూరు ఫిబ్రవరి 25 (ప్రజాపాలన) :** చిత్తూరు జిల్లా వడమాలపేట మండ లంలోని సర్పంచులు, ఉపసర్పంచులు ఎమ్మెల్యే ఆర్.కె.రోజాని ఘనంగా సత్కరించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల కోసం, ప్రజల సంక్షేమం కోసం వాలం టీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని నగిరి ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు.రాష్ట్ర ప్రజలందరూ ఆదరిస్తున్నారని,జగన్ చేస్తున్న అభివృద్ధికి జేజేలు పలుకుతు న్నారని చెప్పారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రజల కోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు.

# గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

**అనంతపురం ఫిబ్రవరి 25 (ప్రజాపాలన) :** అనంతపురంజిల్లా పామిడి పట్టణం లోని చర్చి వెనుక వైపున కొండ గుట్టలో గుర్తు తెలియని మహిళ మృతదేహం కలకలం రేపింది.దింతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ప్రారంభిం చారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఉండటంపై అలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళ వయ స్సు 35 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు ఉంటుందని అంచనా వేస్తున్నారు.హత్య ఆత్మ హత్య అనేది తెలియాల్సి ఉంది కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కిడ్నాపర్ల అరెస్ట్

**అనంతపురం ఫిబ్రవరి 25 (ప్రజాపాలన) :** అనంతపురం జిల్లాలో ఎరువుల వ్యాపారి కూతురి కిడ్నాప్ ప్లాన్ కలకలం రేపింది.నార్పలకు చెందిన ఎరువుల వ్యాపారి చంద్రశేఖర్ నాయుడికి కూతుర్ని కిడ్నాప్ చేస్తామంటూ కొందరు బెదిరింపులకు దిగారు.కోటి ఇవ్వాలని ఫోన్ చేసి బెదిరింపులకు దిగారు.. ఎవరికైనా చెబితే అంతు చూస్తామని బెదిరిం చారు. వెంటనే ఎరువుల వ్యాపారి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కిడ్నాప్ గ్యాంగ్ ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేస్తోందని ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి రంగంలోకి దిగారు.ఎరువుల వ్యాపా రికి వచ్చిన ఫోన్ కాల్స్ ఆధారంగా కిడ్నాపర్ల గురించి ఆరా తీశారు. పక్కా ప్లాన్తో పోలీసులు వారిని ట్రాప్ చేశారు. వ్యాపారిని బెదిరించిన బాబావాలి, సుబ్బరాజు అనే వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్కి తరలించారు. కిడ్నాపర్లను పోలీసులు అరెస్ట్ చేయడంతో చంద్రశేఖర్ నాయుడు ఊపిరి పీల్చుకున్నారు. డబ్బుల కోసమే కిడ్నాప్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి పోలీసులు మరిన్ని వివరాలు ఆరా తీస్తున్నారు.

## కారంపూడి పోలీసులకు కరోనా వ్యాక్సిన్

కరోనా వ్యాక్సిన్ వేయించుకున్న కారంపూడి ఎస్ఐ .గల్లా. రవికృష్ణ, సిబ్బంది



**కారంపూడి, ప్రజాపాలన :** కరోనా కష్టకాలంలో కరోనా వారియర్స్ గా పనిచేసిన డాక్టర్లు పోలీసులు, పారిశుధ్య కార్మికులకు కేంద్ర ప్రభుత్వం కరోనా వ్యాక్సిన్ పంపిణి చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కరోనా నియంత్రణకు విశేషంగా కృషిచేసిన పోలీసులకు మొదటి దశ కరోనా వ్యాక్సిన్ పంపిణి చేయాలనీ ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈనేపథ్యంలో కరోనా సమయంలో ప్రజలకు ప్రత్యేక సేవలు అందిస్తున్న విభాగలలో పోలీస్ శాఖ ముందుండటంలో పోలీసులకు టీకాలు అందిస్తున్నారు. ఈ మేరకు బుధవారం గురజాల ప్రభుత్వం ఆసుపత్రి లో కారంపూడి ఎస్ఐ గల్లా. రవికృష్ణ మరియు పోలీసు సిబ్బంది కరోనా టికాను వేయించుకున్నారు. కారంపూడి ఎస్ఐ గల్లా. రవికృష్ణ కరోనా సమయంలో కనపడని శత్రువు కరోనాతో పోరాడి కరోనా నివారణకు ప్రతిష్టమైన చర్యలు చేపట్టారు కరోనా దారిచేరకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందుగా ఈ వ్యాక్సిన్ పోలీసులకు అందించటంతో పోలీసులు హర్షం వ్యక్తం చేసారు.

## పొగమంచు కారణంగా విమానాలు ఆలస్యం

**విజయవాడ ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** గన్నవరం విమానాశ్రయంలో పొగమంచు దుప్పటిలా కప్పేసింది.దట్టమైన పొగమంచు కారణంగా ల్యాండ్ అయ్యేందుకు వీలులేక బెంగుళూరు నుండి గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన స్పైస్ జెట్ విమానం గాల్లో చక్కర్లు కొట్టింది. బెంగుళూరు నుండి సుమారు 50 మంది ప్రయాణికులతో గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన స్పైస్ జెట్ విమానం సుమారు అరగంట పాటు 8 సార్లు చక్కర్లు అనంతరం ల్యాండ్ అయ్యేందుకు వీలులేకపోవడంతో తిరిగి హైదరాబాద్ వెళ్ళిపోయింది.హైదరాబాద్ నుండి గన్నవరం వచ్చిన ఇండిగో విమానం,ఢిల్లీ నుండి వచ్చిన మరో ఇండిగో విమానాలు ల్యాండ్ అయ్యేందుకు వీలులేక గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే 10 గంటల వరకు ల్యాండ్ అయ్యేందుకు వీలుపడే పరిస్థితి నెలకొంది.

## శ్రీవారిని దర్శించుకున్న సెంట్రల్ హోమ్ సెక్రటరీ

**తిరుమల ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** తిరుమల శ్రీవారిని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజీవ్ గుప్తా దర్శించుకున్నారు.. ఉదయం విఐపి విరామసమయంలో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు?ఆలయ అధికారులు ఆయన స్వామివారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలతో సత్కరించారు?ఈ సందర్భంగా సంజీవ్ గుప్తా మాట్లాడుతూ మార్చి 4, 5 తేదీల్లో కరేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో తిరుపతిలో జరగనున్న దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించబోతున్నామన్నారు...ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని సంజీవ్ గుప్తా చెప్పారు

## దివీస్‌కు వ్యతిరేకంగా పోరాడుతాం

నాదెండ్ల మనోహర్

**కాకినాడ ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కేబినెట్ లో 2600 ల ఎకరాల రైతుల భూములను వెన్నక్కి ఇస్తామని చెప్పడం తో జనసేన పార్టీ ఆనందం గా ఉందని జనసేనపార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆ రోజు మీరు తీసుకున్న భూములు పది వేల ఎకరాలు అప్పుడు నష్ట పరిహారం 2 లక్షల రూపాయలు మాత్రమే ఇచ్చారు. 45 రోజులు రైతుల జైల్లో ఉంటే ఏమైంది క్యాబినెట్ సబ్ కమిటీ. ఇదంతా ప్రణాళిక బద్దంగా దోచుకోడానికె. గతం లో దివిస్ ని బంగాళాఖాతంలో కలుపుతామని చెప్పారు ఇప్పుడు కాకినాడ సెజ్ లో మీ పాత్ర ఏమిటని ప్రశ్నించారు. ఎందుకు తూర్పుగోదావరి ప్రాంత వాసులను ఇలా భాధపెడుతున్నారు. రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్ గారి సారధ్యంలో దివిస్ వెనుక జరుగుతున్న కుట్రలను బయట పెడతాం. జరిగిన పంచాయితీ ఎన్నికలలో చూసాం మీరు ఏ రకంగా జరిపారో. ఈబిసి రిజర్వేషన్ గురించి ఎందుకు ఈ ప్రభుత్వం ప్రస్తావించట్లేదు. ప్రతి గ్రామంలో జనసేన తరఫున మహిళలు చాలా అద్భుతంగా పనిచేశారు . ప్రధానంగా దివిస్ విషయం లో జనసేన పార్టీ పూర్తి వివరాలతో,ప్రజల తరఫున కచ్చితంగా పోరాడతామని అన్నారు. జగన మోహన రేడ్డి క్యాబినేట్ మీటింగు తూతూమంత్రంగా జరిగింది.ప్రజలను మబ్బే పేట్టే విధంగా ఉంది. దివిస్. కోసం వ్యతిరేకంగా పోరాడిన పార్టీ జనసేన పార్టీ. వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు క్యాబినట్ కమిటీ .రిపోర్టు.నిన్న సమర్పించడాం. దారుణం. ఇన్ని రోజులు ఏమీ చేసారు. కన్నబాబని అడిగారు.





# ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలి

- ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి సాధించుకోవాలి
- సర్పంచ్‌లకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సూచన
- ఎంపీని మర్యాదపూర్వకంగా కలసిన సర్పంచ్‌లు



**గుంటూరు. ప్రజాపాలన :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు సర్పంచ్‌లకు సూచించారు. ప్రభుత్వ నిధులను సమర్థంగా వినియోగించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. గుంటూరు జిల్లాలోని, ఆయా మండలాల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డ్ మెంబర్‌లు బుధవారం గుంటూరు లోని, జేకేసీ రోడ్డులో గల పార్టీ కార్యాలయం నందు శ్రీకృష్ణదేవరాయలుని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారందరినీ ఎంపీ అభినందించారు. సర్పంచ్‌లు మాట్లాడు తూ.. ప్రజా సేవచేసేందుకు గాను సర్పంచ్‌లుగా గెలుపొందేందుకు వారు పడిన కష్టాలను ఎంపీ గారికి వివరించారు. కలిసిన వారిలో అమరావతి మండలం, మల్లాది గ్రామ సర్పంచ్‌గా గెలుపొందిన నాగమణి .. భర్త వెంపా శ్రీనివాసరావు, క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ జాలయ్య కలిసారు. అమరావతి మండలం, లేమల్లె గ్రామ సర్పంచ్‌గా గెలుపొందిన ఉగ్గం పున్నమ్మ... భర్త యల్లమందయ్య , ఉపసర్పంచ్, వార్డు మెంబర్‌లు, నాయకులు 30మంది కలిసారు. ఫిరంగిపురం మండలం, వేమవరం గ్రామ సర్పంచ్ శివకుమారి, ఫిరంగిపురం మండలం, మేరికపూడి సర్పంచ్ నాగ మల్లేశ్వరి, ఫిరంగిపురం మండలం, పునుగుపాడు గ్రామ సర్పంచ్ కునుగుపాటి మధుసూధ న రావు, వార్డ్ మెంబర్‌లు మర్యాద పూర్వకంగా కలని వారి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించాలన్న ప్రభుత్వ ఆశయాన్ని గ్రామ స్థాయిలో సర్పం చ్‌లు ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

# వైఎస్సార్ సర్పంచులతో తిరుపతి వెంకరేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి







**తిరుపతి. ప్రజాపాలన :** నరసరావుపేట నియోజకవర్గం నందు తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వైస్సార్సీపీ బలపరిచిన సర్పంచ్ లతో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న నరసరావుపేట శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 70 మంది బృందంతో తిరుమల పుణ్యక్షేత్రం సందర్శన.తిరుమల నందు అన్న ప్రసాద భవనం నందు బృందంతో కలిసి భోజనం చేసిన శాసనసభ్యులు. ఇన్ని లక్షల మందికి నిరాటంకంగా , నాణ్యమైన భోజనం సరఫరా చేయటం అద్భుతమని టీటీడీ అధికారులను అభినందించిన ఎమ్మెల్యే .కోటప్పకొండ అభివృద్ధి కొరకు ,పైన మెట్ల మార్గం నిర్మాణం కొరకు టీటీడీ జెఈఓ ధర్మారెడ్డి గారికి వినతిపత్రం అందజేసిన శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి .

## తిరుమలేశుడికి బంగారం వితరణ

**తిరుమల ఫిబ్రవరి 25 (ప్రజాపాలన) :** అలంకారప్రియుడైన తిరుమలేశుడికి మరో అపూర్వమైన స్వర్ణా భరణాలను తమిళనాడుకు చెందిన భక్తుడు కానుకగా సమర్పించారు. తమిళనాడు తేనికి చెందిన తంగదురై అనే భక్తుడు సుమారు రెండు కోట్ల రూపాయిలతో 4 కిలోల బంగారు శంఖు, చక్రాలు ప్రత్యేకంగా స్వామివారికి తయారు చేయించాడు. ఈ స్వర్ణ కానుకను శ్రీవారి ఆలయంలో టీటీడీ అధికారులకు అందజేశారు?ఈ సందర్భంగా డాటా తంగదురై మాట్లాడుతూ శ్రీవారిపై అపారభక్తితో గతంలో కూడా కోట్లాది రూపాయలు విలువచేసే స్వర్ణాభరణాలను కానుకగా సమర్పించానని. స్వామి పై ఉన్న అపారమైన భక్తితో తాన సంపదను మొత్తం శ్రీవారి విరాళంగా అందిస్తానని తంగదురై చెప్పారు

## సుందరకాండ పారాయణం అత్యంత ఫలదాయకం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



**తిరుమల, ఫిబ్రవరి 25 (ప్రజాపాలన) :** టిటిడి చేపట్టిన సుందరకాండ పారాయణం కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రతి ఇంట్లో భక్తులు పారాయణం చేస్తున్నారని, ఇది అత్యంత ఫలదాయకమని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఉద్ఘాటించారు. తిరుమల నాదనీరాజనం వేదికపై బుధవారం ఉదయం జరిగిన సుందరకాండ పారాయణంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఉపన్యసిస్తూ సుందరకాండ శ్లోకాల శబ్ద తరంగాలు ప్రతి ఇంట్లో వ్యాపిస్తున్నాయని, దీనివల్ల పాజిటివ్ ఎనర్జీ పెరిగి కరోనా వ్యాధి విముక్తికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. యావత్ ప్రపంచానికి ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని అందిస్తున్న టిటిడి యాజమాన్యానికి, అదనపు ఈవో, ఎస్వీబీసీ ఎండి శ్రీ ఎవి.ధర్మారెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రామకథ తెలిసి చెప్పుకున్నా, తెలియక చెప్పుకున్నా గొప్ప అభ్యున్నతి కలుగుతుందన్నారు. సుందరకాండలో అడుగడుగునా రామచంద్రుని గుణగానం వినిపిస్తుందని చెప్పారు. రామకథ చనిపోయే వారిని కూడా బతికిస్తుందని వాల్మీకి మహర్షి తెలియజేశారని వివరించారు. రామకార్యంలో వానరులకు మాటసాయం చేసిన సంపాతికి, హనుమంతునికి ఆతిథ్యమిచ్చిన మైనాకుడికి ఎంతో మేలు చేకూరిందని చెప్పారు. లోక కల్యాణార్థం టిటిడి నిర్వహిస్తున్న పారాయణ యజ్ఞంలో భాగంగా మంత్ర పారాయణం ప్రారంభించి నేటికి 321 రోజులు పూర్తి కాగా, సుందరకాండ పారాయణం 259వ రోజుకు చేరుకుంది. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం శాస్త్ర పండితులు శ్రీ శేషాచార్యులు సుందరకాండ శ్లోకాలను పారాయణం చేయగా, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి డా. ఆకెళ్ల విభీషణ శర్మ అర్థ తాత్పర్యాన్ని, వైశిష్ట్యాన్ని తెలియజేశారు.

## ప్రబలిన అతిసారం.. అధికారులు అప్రమత్తం

**కర్నూలు ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** కర్నూలు జిల్లా దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామంలో అతిసారం ప్రబలింది. మూడు రోజుల నుంచి గ్రామస్తులు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. తొలుత గ్రామంలోని ఉప్పర వీధి వాసులకు వాంతులు, విరేచనాలయ్యాయి. ఆ తర్వాత మరో రెండు కాలనీలకు పాకింది. రెండు రోజుల కిందట ఓ వ్యక్తి అతిసారం లక్షణాలతో మృతి చెందారు. ప్రస్తుతం సుమారు 20 మంది వరకు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు , కోడుమూరు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న వైద్యులు గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.


పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
అంబేడ్కర్ రాజనీతి మూవ్‌మెంట్ (ARM)
(An Unit of JAC Regn. No. 1047 of 2016)
Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublat Plaza, Lakdi-Ka-Pool, Hyderabad - 500 004
https://ambedkarrajaneethi.com E-mail : ambedkarrajaneethimovement@gmail.com

ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి

బహుజన మిత్రులారా !
జై భీమ్

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85% బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి.

అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సమస్యలను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటున్నాం. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాకులు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు, ఫూలే పోరాట పటిమతో బాబాసాహెబ్ డా॥ అంబేడ్కర్‌గారు రాజ్యంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్థించు కుంటూ చేయి చేయి కలిపి సాదిద్దాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలిగించి సభ్యత్వాలను పెంపొందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.

ఫూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) ఆశయాలలో ఏ ఒక్కటి నచ్చినా www.ambedkarrajaneethi.com వెబ్‌సైట్ ద్వారా మీ కుటుంబ సభ్యులందరు మెంబర్స్‌గా చేరండి. సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే సాధించుకొవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.

కనీసం ఏడు (7) కులాల నుండి 21 మంది ప్రతినిధులతో ప్రతి కమిటీ నిర్మాణం జరుగును.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, జోనల్, పార్లమెంట్, అసెంబ్లీ, మండల స్థాయి కమిటీలలో చేరాలని అసక్తి ఉన్నవారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సంప్రదించగలరు.

రాష్ట్ర కన్వీనర్ డా॥ ప్రత్యూష సుబ్బారావు 9030644440
కోశాధికారి గురజాల శ్రీనివాసరావు 9441503772

కో॥ కన్వీనర్స్ అడ్మినిస్ట్రేషన్
అమిరిశెట్టి రమాదేవి 9494153247
గుంజి నరసింహా రావు 7995914086
నమ్మి అప్పారావు 9440137451
డా॥ తమనం విజయ కుమార్ 6301825948

కో॥ కన్వీనర్స్
వేల్పుల విజయ్‌కుమార్ 8106588099
అనుశ్చంద్ర ప్రసాద్ 7989747376
పి.ఆర్.నాయక్ 6301413464
బత్తుల రమణయ్య 7013098631
ఎస్.పి. పుల్లన్న 9398286877
యం. కమలాకర్ రావు 9393921011
గుడిమల్లం గిరిధర్ 9701424945
పొట్లూరి దేవి 9394668555
సొంటి నాగరాజు 9959488555
యం.డి. సలీమా 9705298059

Central Working Committee Members :
జె.బి. రాజు బహుజన IIS-vrs   కె.ఎల్.ఎన్. అల్‌మెన్ రాజు శూద్ర   చింతపల్లి గురుప్రసాద్
నేషనల్ కన్వీనర్ డా॥ కె. శివభాగ్యారావు బహుజన IRS-vrs

అంబేడ్కర్ టి.వి. డైరెక్టర్స్
డా॥ గూడూరు సీతామహాలక్ష్మి 8008840506
పి. పార్వతి
డా॥ పి. పరమ శివన్ 9440077239
అల్లాడి పున్నారావు
వేల్పుల జేస్సిదేవి
పి.యం. రాజు
పి. వెంకటలక్ష్మి
డా॥ ఎం. వెంకటేశ్వరరావు
అమిరిశెట్టి శ్రీధర్
ఎనన్. సంధ్య

జై భీమ్   జై ఫూలే   జై భారత్

ప్రజాపాలన
సంపాదకీయం
గురువారం 25 ఫిబ్రవరి 2021

# ఇండియాగేట్సమాంతర వ్యవస్థగా 'చౌకీదార్'

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి భావోద్వేగం అత్యంత సహజంగా కలుగుతుంది. రెండు రోజుల క్రితం జరిగిన బిజెపి పదాధికారుల (ఆఫీసు బేరర్ల) సమావేశంలో ఆయన దాదాపు రోజంతా పాల్గొని ఎంతో భావోద్వేగంతో మాట్లాడారు. తాను జీవితంలో ఎంత కష్టపడి పైకి వచ్చానో, పార్టీ కార్యకర్త నుంచి ప్రధానమంత్రి వరకూ రావడానికి మధ్య ఎన్ని ముళ్ల దారుల్ని అధిగమించానో ఆయన చెప్పుకున్నారు. సాగు చట్టాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం నమ్మకూడదని, గతంలో కూడా వాజపేయి హయాంలో ఇలాంటి ప్రచారం చేశారని ఆయన వివరించారు.

కొత్తగా పార్టీలో చేరిన వారికి తప్ప ప్రధానమంత్రి ఉపన్యాసాలు తరుచూ వినే వారందరికీ ఆయన భావోద్వేగాలు కొత్తగా అనిపించలేదు. ప్రధానమంత్రి ఎక్కడ స్వరం తగ్గిస్తారో, ఎక్కడ పెంచుతారో, ఎక్కడ ఆవేశంగామాట్లాడతారో, ఎక్కడ గద్గదస్వరం వినిపిస్తారో వారికి బాగా తెలుసు. పార్టీలో కొత్తగా చేరిన వారికి మోదీ ఉపన్యాసం చాలా అద్భుతంగా అనిపించింది. 'ఆయన మాలో ఒక కార్యకర్తగా కలిసిపోయి చాలా ఆత్మీయంగా మాట్లాడారు. కాంగ్రెస్ నాయకత్వానికీ బిజెపి నాయకత్వానికీ చాలా తేడా కనిపించింది..' అని కాంగ్రెస్ నుంచి బిజెపిలో చేరిన ఒక నేత చెప్పారు. మొత్తానికి కొత్తగా నియమితులైన ఆఫీసు బేరర్లందరూ మోదీ అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చారు. వ్యవసాయ, కార్మిక సంస్కరణలను ప్రవేశపెట్టినందుకు, అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు కరోనాను కట్టుదిట్టంగా ఎదుర్కొన్నందుకు వారు మోదీ సర్కార్‌ను అభినందిస్తూ రాజకీయ తీర్మానాన్ని ఆమోదించారు.

ప్రస్తుతం దేశంలో రగులుతున్న అంశాలపై ఎవరూ మాట్లాడలేదు. సమావేశంలో ప్రధాని మోదీదే ప్రధాన ప్రసంగం. పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా వందన సమర్పణలా చేసిన ముగింపు ఉపన్యాసం గురించి తప్ప మిగతా వారు ఏమి మాట్లాడారో పార్టీ ప్రధాన కార్యదర్శి భూపేంద్ర యాదవ్ చెప్పలేదు. 'మోదీ సందేశం లభించడమే మా భాగ్యంగా భావించాము' అని ఆయన చెప్పారు. నిజానికి ప్రధానమంత్రి తన ప్రసంగంలో పార్టీ కార్యకర్తలే నిత్యం జనంలో ఉంటారని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల గురించి ప్రజలేమనుకుంటున్నారో వారికే ముందుగా తెలుస్తుందని అన్నారు. కాని జనం ఏమనుకుంటున్నారో ఆయన ఆఫీసు బేరర్ల ద్వారా అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నించలేదు.

మూడు నెలలకు పైగా రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో ధర్నా చేస్తున్నా బిజెపి పదాధికారుల సమావేశంలో ఎవరూ మాట్లాడలేదు. అసలు గత ఏడాది సాగు చట్టాలపై ఆర్డినెన్స్‌లను ప్రవేశపెట్టినప్పుడు పార్టీలో అంతర్గతంగా ఎందుకు చర్చించలేదని అడగలేదు. కార్మిక చట్టాల గురించి సందేహాలు ప్రకటించలేదు. నిత్యావసర వస్తువులు, పెట్రోలు ధరలు ఆకాశానికి అంటినా ఎవరూ చర్చించే ప్రయత్నం చేయలేదు. ప్రభుత్వ ఆర్థిక విధానాలగురించి కానీ, బ్యాంకులు, ప్రభుత్వ రంగసంస్థలను తెగనమ్మేందుకు చేస్తున్న ప్రయత్నాల గురించి కానీ అడిగే ధైర్యం చూపలేదు. ఈ దేశం భవిష్యత్‌ను మార్చే కీలక నిర్ణయాలు తీసుకున్న ప్రధానమంత్రి రోజంతా తమ మధ్య ఉన్నా తమ మనసుల్లో రేగుతున్న సందేహాలను తీర్చుకునే ప్రయత్నం ఎవరూ చేయలేదు. ఇది పార్టీ ఆఫీసు బేరర్ల సమావేశమే కనుక హోంమంత్రి అమిత్ షాతో పాటు కేంద్రమంత్రులెవరినీ ఆహ్వానించలేదు. గతంలో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతి కేంద్రమంత్రి పార్టీ కార్యాలయానికి వచ్చి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వివరించేవారు. కాని ఇప్పుడు కేంద్రమంత్రులకు ఆ విలువ ఉన్నట్లు లేదు. మోదీ తీసుకున్న అన్ని నిర్ణయాలను రాజకీయ తీర్మానంలో పొందుపరిచి సభ్యుల హర్షధ్వానాలు పొందడమే ధ్యేయంగా ఈ సమావేశం జరిగింది. తాను తీసుకున్న నిర్ణయాలపై పార్టీ లాంఛన ఆమోదం పొందేందుకే మోదీ ఈ సమావేశం జరిపినట్లనిపించింది.

కొత్తగా ఎన్నికైన పదాధికారులందరూ మోదీ, అమిత్ షా ఆచితూచి ఎంపిక చేసిన వారే. వారిలో కనీసం పదిశాతం మంది బిజెపిలో గత రెండు మూడేళ్లలోనే చేరిన వారు. తెలుగురాష్ట్రాల్లో కాంగ్రెస్ క్షీణ దశను గమనించిన డికె అరుణ, పురంధేశ్వరి, ఒడిషాలో బిజూ జనతాదళ్ తరఫున రెండుసార్లు లోక్ సభకు, రెండుసార్లు రాజ్యసభకు ఎంపికైన జయపాండా, తృణమూల్ కాంగ్రెస్ తరఫున రాజ్యసభకు ఎంపికై యుపిఏలో మంత్రిపదవులు చవి చూసిన ముకుల్ రాయ్, కేరళలో ఎస్ఎఫ్ఐ దశనుంచి సిపిఐ(ఎం) పార్టీలో ఉంటూ తర్వాత కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీల్లో రెండుసార్లు లోక్‌సభకు, ఒకసారి శాసనసభకు ఎన్నికై, చివరకు మోదీ విధానాలను ప్రశంసించి పార్టీ నుంచి బహిష్కృతుడైన అబ్దుల్లాకుట్టి, మొదటి ప్రయత్నంలోనే 1994లో ఐఏఎస్‌కు ఎంపికై ఒడిషాలోనూ, కేంద్రంలోనూ ముఖ్య పదవులను నిర్వహించిన అపరాజితా సారంగి వీరంతా బిజెపిలో తమ భవిష్యత్‌ను వెతుక్కుంటూ వచ్చిన వారే. ఇలాంటి పదాధికారులంతా తమ రాజకీయ భవిష్యత్‌ను చూసుకుంటారు కాని మోదీ, అమిత్ షా నిర్ణయాలను ప్రశ్నించి, లేదా కనీసం చర్చించి వివాదాస్పదం కావాలని ఎందుకు అనుకుంటారు?

మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఇలాంటి కొత్త నేతలను, కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారు. వారికి పార్టీలో కీలక పదవులను కల్పిస్తున్నారు. పార్లమెంట్‌లో ఇతర పార్టీలకు చెందిన నేతలకు కన్నుగీటి తమవైపుకు తిప్పుకుంటున్నారు. కాంగ్రెస్, జనతాదళ్‌ల నుంచి తృణమూల్‌లో చేరి రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికై, మన్మోహన్ హయాంలో మంత్రిపదవులు కూడా నిర్వహించిన దినేశ్ త్రివేది తాజాగా తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి కాషాయతీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రాల్లో వ్యూహం మరొకరకంగా ఉన్నది. అధికారంలో ఉన్న ప్రభుత్వాలను పడగొట్టాలన్నా, తాము అధికారంలోకి రావాలన్నా ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను రాజీనామా చేయించడం, వారికి మళ్లీ సీట్లు ఇచ్చి గెలిపించుకోవడం బిజెపికి వెన్నతో పెట్టిన విద్య అయింది. రెండు రోజుల క్రితం అయిదుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో పుదుచ్చేరిలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయిన విషయం తెలిసిందే. ఏప్రిల్‌లో పుదుచ్చేరిలో ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వం ఉంటే అక్కడ విజయం ఏదో రకంగా దక్కించుకోగలమన్నదే బిజెపి వ్యూహంగా కనిపిస్తోంది. అనుసరించిన పద్ధతిలో తేడా ఉందేమోకాని, కాంగ్రెస్‌లో గతంలో అవలంబించిన సంస్కృతికీ, బిజెపిలో ఏర్పడుతున్న సంస్కృతికీ పెద్ద తేడా కనిపించడం లేదు. నిజానికి మోదీ అనే వ్యక్తే ఒక తిరుగులేని శక్తిగా ప్రభవిస్తున్నారు. సకల రాజకీయాలు మోదీ చుట్టూనే తిరుగుతున్నప్పుడు మిగతా వారంతా ఆయనకు 'ప్రచారక్'లుగా మారడంలో ఆశ్చర్యం లేదు. అందుకే బిజెపి పదాధికారుల సమావేశాలు జరిగినా, పార్లమెంటరీ పార్టీ సమావేశాలు జరిగినా మారుతున్న భారత రాజకీయాల తీరుతెన్నులను తెలుసుకొమ్మని వారికి మోదీ చెబుతున్నారు. తమ పనితీరు మార్చుకోవాలని, తన ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని నిర్దేశిస్తున్నారు.

ఇదంతా ఒక పంచ కూళ కషాయం అయితే కాంగ్రెస్‌ను, ఇతర పార్టీలను ద్వేషించి, మోదీని అభిమానించి బిజెపిలో చేరకపోయినా ఆ పార్టీకి అండగా నిలుస్తున్న కొత్త తరం ఒకటి తయారైంది. వేలాది మందితో కూడిన సోషల్ మీడియా బృందాలు ఏర్పడ్డాయి. వారు ప్రభావితం చేస్తున్న ప్రజల సంఖ్య కూడా తక్కువేమీకాదు. వీరందరికీ ఒకప్పటి సిద్ధాంతాల గురించి, కానీ బిజెపికి, సంఘ్‌కు ఉన్న సంబంధం గురించి కానీ పెద్దగా తెలియకపోవచ్చు. గతంలో వాజపేయి, అడ్వాణీ ఉన్నప్పుడు ఆర్ఎస్ఎస్ బిజెపి సంస్కృతిని నిర్దేశించేది. ఇతర పార్టీలతో పోలిస్తే తమది విశిష్టమైన పార్టీ అని చెప్పుకునేది. ఇప్పుడు బిజెపి తనకంటూ భిన్నమైన సంస్కృతిని ఏర్పర్చుకుంది. ఇది మోదీ సంస్కృతిబీ సంఘ్‌తో నిమిత్తం లేకుండా ఒక పద్ధతి ప్రకారం ఏర్పడుతున్న సమాంతర వ్యవస్థ. సంఘ్ సమర్థించినా, సమర్థించకపోయినా మోదీని సమర్థించే మోదీ సేన ఒకటి స్పష్టంగా కనిపిస్తోంది. కానీ పదాధికారులనుంచి పార్లమెంట్ సభ్యుల వరకూ, కార్యకర్తలనుంచి సీనియర్ నేతల వరకూ ప్రశ్నించేవారే లేరు. సంభవిస్తున్న పరిణామాలను చర్చించేవారే అంతకంటే లేరు. పార్టీకి, ప్రభుత్వానికి, ప్రజాస్వామానికీ అతీతంగా వాటిని శాసించే ఒకే ఒక వ్యక్తి ఉన్నప్పుడు, దేశంలో ప్రభవిస్తున్న ప్రస్తుత వ్యవస్థకు ఏ పేరు పెట్టాలా అన్న సందేహం కలగక తప్పదు. రెండోసారి ఎన్నికయిన వెంటనే మోదీ తన ట్విట్టర్ నుంచి మై భీ చౌకీదార్ హు (నేను కాపలాదారు) అన్నటాగ్ లైన్‌ను తీసేశారు. కాపలాదారు పదానికి అర్థం మారిపోయిందా?

# కట్టుదిట్టమైన చట్టాలు, నీరుగార్చే తీర్పులు

భారత స్త్రీకి నిత్యజీవితంలో ఎంతటి వివక్ష ఎదురవుతున్నా, చట్టపరంగా మాత్రం రక్షణలు బలంగానే ఉన్నాయి. సమానతల విషయంలో సానుకూల చట్టాలు, కుటుంబహింసల నుంచి అనేక రక్షణలు ఉన్నాయి. అవకాశాలపరంగానూ రోజురోజుకూ అనుకూలత పెరుగుతున్నది. స్త్రీ గౌరవానికి భంగం కలిగించకుండా 160సంవత్సరాల నాడే భారతీయ శిక్షాస్మృతిలో అనేక సెక్షన్లను పొందుపరిచారు. అందులో ప్రధానమైనది సెక్షన్ 354. స్త్రీ గౌరవానికి భంగం కలిగించినవారికి రెండు సంవత్సరాల జైలుశిక్షగాని, జరిమానాగాని ఈ సెక్షన్ కింద శిక్షగా విధించవచ్చు. ఆ తర్వాత 2013లో ఈ శిక్షను ఐదేళ్లకి పెంచడమేగాక కచ్చితంగా జైలు, జరిమానా రెండూ విధించాలని సవరించారు. ఈ సెక్షన్ ద్వారా పసిపిల్లల నుంచి వృద్ధ మహిళల వరకూ ఎవరైనా రక్షణ పొందవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా పిల్లల పైనా, మైనర్ బాలికల పైన లైంగిక హింసలు పెరిగిపోవడంతో 1992లో ఐక్యరాజ్యసమితి దీనిపై ఒక అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. దీనిని అంగీకరించిన భారత ప్రభుత్వం లైంగిక వేధింపుల నుంచి పిల్లల్ని రక్షించే ఉద్దేశంతో 'పోక్సో' చట్టాన్ని 2012 నుంచి అమలులోకి వచ్చేట్లుగా ఆమోదించింది. భారతదేశంలోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ అదనపు సెషన్స్ కోర్టులు ఉన్నందున అందులో ఒక అదనపు జిల్లా కోర్టును ఈ కేసులు విచారించడానికి కేటాయించడమే గాక ఈకాలంలో ఈ కేసుల కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లని కూడా నియమించారు. ఈ కొత్త చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం ఎవరైనా వ్యక్తి కామపరమైన కోరికతో పిల్లల మర్మావయవాల్నిగానీ, వక్షభాగాన్ని గానీ, పృష్ఠ భాగాన్ని గానీ తాకితే వారు మూడేళ్ళకు తగ్గకుండా శిక్షించబడతారు. ఈ విధంగా శాసన నిర్మాణ వ్యవస్థ స్త్రీల పట్ల, బాలల పట్ల జరిగే లైంగిక వేధింపుల కట్టడికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా, మరోప్రక్క వీటిని నీరుగార్చే ప్రయత్నమూ జరుగుతుంది. న్యాయవ్యవస్థలో భాగమైన బొంబాయి హైకోర్టు న్యాయమూర్తే ఇలాంటి చర్యకు పాల్పడటం విచారకరం కాగా, ఆ న్యాయమూర్తి స్త్రీ కావడం మరో విషాదం.

మహారాష్ట్రలోని నాగపూర్‌లో 39ఏళ్ళ పురుషుడు ఒక 12సంవత్సరాల మైనర్ బాలికను తినడానికి ఏదో పెడతానని చెప్పి తన ఇంటికి తీసుకెళ్ళి ఆ బాలిక వక్షోజాల్ని తాకరాని విధంగా తాకడమే గాక ఆ పాప వేసుకున్న దుస్తుల్ని తొలగించే ప్రయత్నం చేయగా ఆ పాప భయంతో కేకలు వేసింది. ఆ పాప తల్లిదండ్రులతో పాటు సమీపంలోని జనం పాపను కాపాడారు. ఈ కేసుని విచారించిన కోర్టు నిందితునికి మూడేళ్ళ జైలుశిక్ష విధించింది. పోక్సో చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం ఇది కనీస శిక్ష. ఇంతకంటే తక్కువ శిక్ష విధించే అవకాశం లేదు.

ఈ కేసుపై నిందితుడు అప్పీలు చేసుకోగా బొంబాయి హైకోర్టు నాగపూర్ బెంచ్ న్యాయమూర్తి పుష్ప గండేవాలా జనవరి 19న నిందితునికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. నిందితుడు బాలిక దుస్తుల్ని తొలగించడంగాని, దుస్తులలోకి చేయి జొనపడంగాని చేయలేదని, "చర్మానికి



చర్మం ఆనించలేద"ని కనుక పోక్సో చట్టం వర్తించదని తీర్పు చెప్పారు. న్యాయమూర్తి పుష్ప వ్యాఖ్యలకు ఈ చట్టంలో పేర్కొన్న అంశాలకు, కూర్చిన పదబంధాలకు, నిర్వచనాలకు ఎక్కడా పొంతనే లేదు. చర్మానికి చర్మం అనే పదమే సెక్షన్ 7లో ఎక్కడా లేదు.

ఈ తీర్పు న్యాయ వ్యవస్థ డొల్లతనాన్ని ఎత్తి చూపుతోంది. మన దేశంలో న్యాయ నిర్ధారణ ఎంత అశాస్త్రీయంగా ఉంటుందో, చట్టాలు ఎంత కట్టుదిట్టంగా ఉన్నా న్యాయమూర్తుల వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు వాటి అమలును పూర్తిగా వదిలివేయడం ఎన్ని అనర్థాలకు దారితీస్తుందో జస్టిస్ పుష్ప తీర్పు ఉదంతం ద్వారా అర్థమవుతోంది. ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తుల్లో సగంమంది అవినీతిపరులున్నారని ప్రశాంత భూషణ్ లాంటి న్యాయనిపుణులు బహిరంగంగా ఆరోపించారంటే న్యాయ నిర్ధారణలో వ్యక్తిగత అభిప్రాయాలకున్న ప్రాధాన్యతే కారణం. జిల్లా కోర్టులు ఇంకా కింద కోర్టుల్లో కూడా న్యాయమూర్తులుగా ఉన్నవారిలో "మేము ఈ సెక్షన్‌ని గుర్తించం, దీని ప్రకారం ఆదేశాలు ఇవ్వం" అనే ధోరణి చాలా రోజులుగా న్యాయపాలనలో ఉంది.

ఈ తీర్పుపై వివాదం చెలరేగడంతో ఇదే న్యాయమూర్తి ఈ తీర్పు చెప్పడానికి నాలుగు రోజుల క్రితం చెప్పిన మరో వికృతమైన తీర్పు కూడా వెలుగుచూసింది. 50 సంవత్సరాల వయసున్న వ్యక్తి 5 సంవత్సరాల వయసున్న బాలిక ముందు ఫ్యాంటు జిప్పు తీసి ఆ పాప చెయ్యిపట్టుకున్నాడు. ఆ కేసును విచారించిన కింది కోర్టు అతనికి ఐదేళ్ల కారాగారశిక్షతో పాటు 25వేల జరిమానా కూడా విధించింది. దానిపై అతను చేసుకున్న అప్పీలులో చేయి పట్టుకోవడం, జిప్పు విప్పటం లైంగిక దాడి కాదంటూ జనవరి 15న ఈ న్యాయమూర్తి పుష్ప తీర్పు చెప్పారు.

ఈ సందర్భంగా గతంలో దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన పంజాబ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కెపియస్ గిల్ కేసును ఒకసారి పాఠకులకు గుర్తుచేయాలి. 1988లో సహచర ఐపిఎస్ అధికారి ఎస్ఎల్ కపూర్ ఇచ్చిన విందు సమావేశానికి 20–25 మంది ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల జంటలు హాజరయ్యాయి. ఒంటరిగా వచ్చింది డిజిపి గిల్ ఒక్కరే. అదే విందుకు హాజరైన ఐఎఎస్ అధికారిణి శ్రీమతి రూపన్ డియోల్ బజాజ్ జఘన భాగంలో తట్టి అనుచితంగా ప్రవర్తించాడని ఆమె ఐపిసిలోని 354 సెక్షన్ కింద కేసు పెట్టింది. ఇంకా కొన్ని ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో తమ పోలీస్ బాస్ పైన కేసు పెట్టకుండా క్లోజ్ చేశారు. దీనిపై ఆమె భర్త, మరో ఐఎఎస్ అధికారి అయిన బిఆర్ బజాజ్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ దగ్గర ఫిర్యాదు చేశారు. అదీ హైకోర్టులో క్వాష్ చేయబడింది. సుప్రీంకోర్టు కేసును పునరుద్ధరించి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌ని విచారించమనగా ఆ కోర్టు విచారించి డిజిపికి మూడు నెలల కారాగారశిక్ష విధించింది. చివరకు సుప్రీంకోర్టు ఎంకె ముఖర్జీ బెంచి ఈ శిక్షను ప్రొబేషన్ కిందకు మార్చి 2 లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది (1996 ఎఐఆర్ 309). ఇంత స్పష్టంగా అనేక వందల కేసుల్లో సర్వోన్నత న్యాయస్థానం, మరెన్నో హైకోర్టులు తీర్పులు చెప్పినా శ్రీమతి పుష్ప ఈ రకమైన వికారపు తీర్పులు చెప్పడం బాధ్యతారహితం.

హైకోర్టు జడ్జిగా 2018లో ఒకసారి ఈమె పేరు ప్రతిపాదన వచ్చినా ఈమెపై ఆరోపణలు ఉండడంతో పదోన్నతి ఇవ్వకుండా పక్కన పెట్టిన కొలిజియం 2019లో మళ్ళీ ఈమె పేరు పరిగణనలోకి తీసుకొని నియమించడాన్ని చూస్తే, న్యాయమూర్తుల నియామక ప్రక్రియకు సర్వజనామోదమైన పద్ధతినొకదాన్ని కనుగొనాలనే వాదన మరోసారి ముందుకు వస్తుంది. ఒకవైపు కట్టుదిట్టమైన చట్టాలు, మరోవైపు నీరుగార్చే తీర్పులు. అయితే అటార్నీ జనరల్ కె.వేణుగోపాల్ జస్టిస్ పుష్ప తీర్పును సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్ళడంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ. బాబ్డే ఈ తీర్పుపై స్టే విధించారు. పోక్సో చట్టం స్ఫూర్తిని ఆమె తీర్పు నీరుగార్చిందని ఈ సందర్భంగా ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రస్తుతానికి జస్టిస్ పుష్పను శాశ్వత న్యాయమూర్తిగా నియమించే నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కొలిజియం వెనక్కు తీసుకుంది. ఏదేమైనా ఈ ఉదంతం మన న్యాయవ్యవస్థలోని తీవ్రమైన లొసుగుల్ని ఎత్తి చూపింది. సాధారణంగా కేసుల విచారణ సందర్భంలో పెద్ద కోర్టుల ఇచ్చిన తీర్పులు ఉదహరించడం ద్వారా విచారణ సమయంలోనే దానిని అనుసరించి నేర నిరూపణ ప్రక్రియ జరుగుతుంది. జస్టిస్ పుష్ప తీర్పుని తర్వాతి కేసుల్లో ప్రామాణికంగా తీసుకుంటే దేశంలో ఎక్కడైనా స్త్రీలు ఇల్లు వదిలి బయటకు రాగలరా?


## వేగంగా స్పందిస్తున్న సత్తెనపల్లి పట్టణ పోలీస్ సిబ్బంది

### మార్కెట్ వెనుక ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

సత్తెనపల్లి ప్రజాపాలన : నమో వెంకటేశా..నీ దర్శనానికి ఇన్ని ఇక్కట్లా.? శీర్షికతో వచ్చిన వార్తకు సత్తెనపల్లి పట్టన సి.ఐ విజయచంద్ర గారు స్పందించారు. పట్టణ ఎస్సై. రఘుపతి,హెచ్‌సీ. రవి కుమార్ కూరగాయల మార్కెట్ వెనకవైపు ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న ట్రాఫిక్ ను పరిశీలించేందుకు ఆయన పంపించారు. ఆలయం దగ్గరకు వెళ్లి మార్కెట్ వ్యాపారస్తులు నిర్వహిస్తున్న పాట కొట్లను, వారు తెచ్చే వాహనాలను నిలుపు తున్న ప్రాంతం ప్రత్యక్షంగా గమనించిన పోలీస్ సిబ్బంది వాహనాల పార్కింగ్‌ను స్థానిక వ్యాపారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. వ్యాపారస్తులు ఆలయంలోకి వెళ్ళే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పట్టణ సిఐ ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. స్పందించిన సిఐకి స్థానికులు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు, సభ్యులు తెలియజేస్తున్నారు.

## బాపట్లలో వైభవంగా ప్రింటర్స్ డే





బాపట్ల, ప్రజాపాలన : ముద్రణా రంగ పితామహుడు జాన్ గూటెన్బర్గ్ జయంతి రోజైన ఫిబ్రవరి 24 ప్రింటర్స్ డే గా కార్మిక సోదరులు , తోటి యజమానులతో జరుపుకోవటం సంతోషంగా ఉందని బాపట్ల మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో లాక్ డౌన్ నిబంధనల సమయంలో ఉపాధి కోల్పోయిన కార్మిక సోదరులకు అసోసియేషన్ తరపున కూరగాయలు నిత్యావసర సరుకులు, బియ్యం ఇచ్చి ఆదుకోవడం జరిగిందన్నారు. అలాగే అసోసియేషన్ ట్రెజరర్ జై శ్రీనివాసరావు సొంత నిధులతో కార్మికులను ఆర్థికంగా, నిత్యవసర వస్తువులు పంపిణీ చేసి తన వంతు సహాయం చేశారని, రైస్మిల్లర్స్ అసోసియేషన్ సహాయంతో కార్మికులకు బియ్యాన్ని పంపిణీ చేశారని కొనియాడారు. సెక్రటరీ రాజ దయాశీలన్ (చిన్ని) మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రముఖ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్, సగల రాజశేఖర్ బాబు లు కార్మికులకు చేసిన సాయం మరువలేనిదన్నారు. సభ్యులు సుబ్బరామయ్య మాట్లాడుతూ ప్రింటింగ్ రంగంలో ఈ స్థాయికి రావడానికి కీర్తిశేషులు ఆలపాటి రంగారావు తోడ్పాటేనని గుర్తు చేశారు.

## లూథరన్ దేవాలయ ద్వితీయ ప్రతిష్ట మహెూత్సవం



బాపట్ల, ప్రజాపాలన ప్రతినిధి : బాపట్ల హయ్యర్ నగర్ లోని ఫాథర్ హయ్యర్ మెమోరియల్ లూథరన్ దేవాలయ ద్వితీయ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొన్నా ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి కోన రఘుపతి సతీమణి కోన రమాదేవి

## నియోజకవర్గ కాపు సంఘం యువజన అధ్యక్షుడుగా రఘుపతి అశోక్‌కుమార్



కారంపూడి, ప్రజాపాలన : వినుకొండ నియోజకవర్గం మారుమూల ప్రాంతమైన బొల్లాపల్లి మండలం జయంతి రామపురం గ్రామానికి చెందిన అశోక్ కి పదవి రావడం పట్ల సంతోషంగా ఉందని స్నేహితులు తెలిపారు రఘుపతి అశోక్ కుమార్ మాట్లాడుతూ నన్ను నమ్మి నాకు అధ్యక్షుని బాధ్యతలు ఒప్పచెప్పిన రాష్ట్ర కమిటీకి ఆయన ధన్యవాదాలు తెలియచేసారు గ్రామ ప్రజలు మాట్లాడుతూ నియోజకవర్గ కాపు సంఘం యువజన అధ్యక్షుడిగా రఘుపతి అశోక్ కుమార్ కు పదవి రావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తలను పరామర్శించిన.. బచ్చుల



గన్నవరం, ఫిబ్రవరి 24 (ప్రజాపాలన న్యూస్): బాపులపాడు మండలం రంగన్నగూడెం వద్ద ఈ నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఆ పార్టీ గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జి, శాసనమండలి సభ్యుడు బచ్చుల అర్జునుడు బుధవారం పరామర్శించారు. మినపకాయ పనులకు వెళ్లి వీరవల్లి నుంచి రంగన్నగూడెం గ్రామానికి ఆటోలో పది మంది వెళుతుండగా ప్రమాదం జరిగింది. వారిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రంగన్నగూడెం గ్రామానికి చెందిన కొలుసు మల్లేశ్వరి, కొలుసు జమలమ్మ నడవలేని స్థితిలో ఉండటంతో వారిని విజయవాడ ప్రభుత్వాసు పత్రికి తరలించారు. కొలుసు మల్లేశ్వరి కాలు నలిగిపోవడంతో శస్త్ర చికిత్స చేశారు. అలాగే నడుముకు తీవ్ర గాయమైన కొలుసు జమలమ్మకు కూడా శస్త్ర చికిత్స చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారిద్దరి ఆరోగ్యం గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ అడిగి తెలుసుకున్నారు. శస్త్ర చికిత్స చేసిన ఇద్దరికీ మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్సీ అర్జునుడు కోరారు.
ఎమ్మెల్సీ అర్జునుడు వినతిమేరకు జమలమ్మను మెరుగైన చికిత్స కోసం మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అదే ప్రమాదంలో గాయపడి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నెర్సు దుర్గా భవాని, మొవ్వా రమాదేవి చికిత్స పొందుతున్నారు. వారిద్దరి ఆరోగ్యం గురించి ఏలూరు ప్రభ్యుసుపత్రి సూపరింటెండెంట్ తోనూ ఎమ్మెల్సీ అర్జునుడు మాట్లాడారు. వారికి కూడా శస్త్ర చికిత్స చేశామని, ఆరోగ్యంగానే ఉన్నట్లు డాక్టర్ తెలిపారు. విజయవాడ ఆసుపత్రిలో బాధితులను ఎమ్మెల్సీ అర్జునుడుతో పాటు సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రంగన్నగూడెం నాయకుడు కసుకుర్తి అర్జునరావు తదితరులు ఉన్నారు.

## కోవిడ్ వ్యాక్సిన్ పట్ల అపోహలు వద్దు: ఎస్ఐ



వేటపాలెం, ప్రజాపాలన: కోవిడ్ వ్యాక్సిన్ పట్ల ఎటువంటి అపోహలు, అనుమానాలు వద్దని ఎస్ఐ కె కమలాకర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫేజ్ వన్ కోవిడ్ వ్యాక్సిన్ జరుగుతున్న సందర్భంగా అయన వ్యాక్సిన్ టీకా వేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు వ్యాక్సిన్ వేయించుకోవడం పై అనుమానాలతో ముందుకు రావడం లేదని వాపోతున్నారు. వేటపాలెం ఎస్ఐ కె కమలాకర్ చొరవతో, ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది 27 మంది వ్యాక్సినేషన్ టీకా తీసుకోవడం జరిగిందన్నారు.
తదుపరి 24 మంది ఫ్రంట్ లైన్ వర్కర్స్ కూడా వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిందన్నారు. కనుక స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యాక్షిన్ తీసుకోవడం జరిగితే ఫెస్ 2 కూడా త్వరితగతిన పూర్తిచేయుటకు వీలుంటుందని కనుక అపోహలు నమ్మవద్దని ఉద్యోగులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అనంతరం ఎస్ఐ కె కమలాకర్ మాట్లాడుతూ కొవిడ్-19 వాక్సిన్ సురక్షితమని దీనిపై ఎటువంటి అపోహలు, వదంతులు నమ్మవద్దన్నారు. కరోనాను నివారించేందుకు ముందుగా అన్ని శాఖల సిబ్బంది సహకరించి తప్పక కొవిడ్ వాక్సిన్ టీకాను వేయించుకోవాలని సూచించారు. ఫ్రంట్ లైన్ వారియర్స్ టీకాలను వేయించుకుని కొవిడ్ ను మొదటి దశలో ఎదిరించినట్లుగానే రెండో దశలో కూడా ఎదిరించటానికి సిద్ధమవ్వాలన్నారు. అన్ని దశల పరిశోధనలు చేసిన తరువాతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాక్సిన్ ను అందిస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జెఈఈ మెయిన్స్ పరీక్షలకు 650 మంది హాజరు




వేటపాలెం, ప్రజాపాలన: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో బుధవారం నిర్వహించిన జెఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షలకు 650 మంది విద్యార్థులు హాజరు అయ్యారని కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పొగడదండ రవికుమార్ మాట్లాడుతూ నెషనల్ టెస్టింగ్ ఎజెన్సి, న్యూడిల్లి వారి ఆధ్వర్యములో నిర్వహించే జెఈఈ మెయిన్స్ పరీక్షలను తమ కళాశాలలోని టిసియస్ ఐయాన్ సెంటర్‌లో ఆన్లైన్ పద్ధతిలో, కరోనా నిభందనలు పాటిస్తూ నిర్వహిస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లాలో తమ కళాశాలలోనే జెఈఈ మెయిన్స్ ఎంట్రన్స్ పరీక్షలకు సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. మొదటి విడత పరీక్షలను 23-02-2021 మంగళవారం నుంచి 26-02-2021 ఆదివారం వరకు జరుగుతాయన్నారు. బుధవారం పరీక్షలకు 671 మందికి విద్యార్థులకు గాను 650 మంది విద్యార్ధులు హాజరయ్యారన్నా రు. ఈ పరీక్షలకు షేక్ ఆలీసాహెబ్ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్నా రన్నారు.

## చౌటపాపాయపాలెం సర్పంచ్‌గా వల్లాల నాగరాజు




రాజుపాలెం, ప్రజాపాలన : రాజుపాలెం (మం) చౌటపాపాయపాలెం గ్రామ పంచాయతీ నూతన యువ సర్పంచిగా వల్లాల నా గరాజు ఎన్నికైన సందర్భంగా మండల తాసిల్దార్ నగేష్, ఎంపిడిఓ శ్రీనివాసరావు ను, మరియు రాజుపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ అమీర్‌ను, మర్యాదపూర్వ కంగా కలిసి స్వీట్స్ ఇచ్చి పరిచయం చేసుకున్న, వల్లాల నాగరాజును అభినందిం చారు. గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపించాలని, తగు సూచనలు సలహాలు ఇచ్చారు. నేటి యువత గ్రామ సర్పంచ్‌గా ఎన్నికవడం భవిష్యత్తు తరాలకు ఎంతో ఆదర్శం అన్నారు. వైస్ ప్రెసిడెంట్, కుందూరు పేతురు, మేకల వెంకటేశ్వర్లు, భయ శేషగిరిరావు, ముసుకు నరసింహారావు, నీలి శెట్టి చెన్నకేశవరావు, మాజీ సర్పంచ్ అబ్బాయి నంద్యాల బాలయ్య, నల్ల గొర్ల పున్నారావు, అడక సత్యనారాయణ, అడక చిన్న ఎలమంద, కడియం చిన్నగాలయ్య, వల్లాల పెద్దబాలయ్య, వల్లాల వెంక ట్రావు, తోకల రాంబాబు, గాను పల్లి అశోక్, పొన్నూరు వెంకట్రావు పాల్గొన్నారు...

## గుంతలమయంగా మారిన రోడ్డు పట్టించుకునే నాథుడే లేడా?



వీరులపాడు, ప్రజాపాలన : వీరులపాడు మండలం అల్లూరులో ఆర్అండ్ బీ రహదారిపై అధ్వాన్న స్థితి లో ఉందివెూకాళ్ళ లోతు గోతులతోవాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయిఈ రోడ్డులో ప్రయాణం చేస్తే ఒళ్ళు హూనం అవుతుంది బండి షెడ్ కి వెళ్తుందని ప్ర యాణికులు వాపోతున్నారుమరమ్మతులు చేసిన కాంట్రాక్టర్ జేబులు నింపుకుంటున్నారు కానీ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల రహదారి మరిం త అద్వాని స్థితికి చేరుకుందిఅధికారులు స్పందించి ఇప్పటికైనా మరమ్మతులకు బదులు కొత్త రోడ్డు వె య్యాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంఎల్‌వి



వేటపాలెం, ప్రజాపాలన: డిఆర్డిఏ వైఎస్ఆర్ కెపి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వేటపాలెం మండల పరిధిలోని కొత్తపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం చీరాల శాసనసభ్యులు కరణం బలరాం కృష్ణమూర్తి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ వరి రైతులకు కనీస మద్దతు ధర అందచేయడానికి ప్రభుత్వం వారి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. రైతులందరి నుంచి డిఆర్ డిఎ ధాన్యము కొనుగోలు చేసి నేరుగా రైతు యొక్క ఖాతాకు డబ్బులు జమచేయడం జరుగుతుందన్నారు. అంతేగాక రైతులందరూ రైతు గ్రూపులో చేరాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏపిఎం బుదాటి శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో డిఆర్డిఏ కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయని, డీఆర్డీఏ మండలంలో సాధించిన ప్రగతిపై డిఆర్ అభినందించడం జగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అదేవిధంగా ఏరియా కోఆర్డినేటర్ అంబేద్కర్, ఎండిఓ ఈవో గౌస్, వివో ఏలు, విఏఎలు, పొదుపు గ్రూపు మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## అంజయ్య కుమారుడు పెద్దకర్మలో కోడెల శివరామకృష్ణ



రాజుపాలెం, ప్రజాపాలన : రాజుపాలెం మండలంలోని అనుపాలెం గ్రామ మాజీ సర్పంచ్ గోగుల అంజయ్య కుమారుడు పెద్ద ఖర్మ కార్యక్రమంలో సతైనపల్లి నియోజకవర్గ నేత డాక్టర్ కోడెల శివరామకృష్ణ పాల్గొని ఘననివాళీ అర్పించారు ఈకార్యక్రమంలో రాజుపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు. వ్యవసాయ శాఖ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ పూజల వెంకటకోటయ్య అనుపాలెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాఘవులు పాల్గొన్నారు

# లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో దుమ్మురేపిన వైసీపీ



**విజయవాడ, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** ఏపీ స్థానిక ఎన్నికలు వైసీపీ క్యాడర్ కు ఫుల్ జోష్ ఇచ్చాయి. 80 శాతం పైగా విజయాలతో అధికార పార్టీ దుమ్ము రేపింది. జగన్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందనే విమర్శకుల నోళ్లకు తాళం పడేలా ఫలితాలు రావడంతో.. వైసీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. పల్లెపై తన పట్టు ఎంత బలంగా ఉందో పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ మరోమారు చాటి చెప్పింది. పంచాయతీ ఎన్నికల ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లో పునరావృతమౌతాయని వైసీపీ నేతలు నమ్మకంగా ఉన్నారు. వైసీపీ ఏకపక్ష విజయాలు గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు ఎంత బలంగా ప్రజాదరణ పొందాయో చాటుతున్నాయి. పేరుకు పార్టీ రహితంగా జరుగుతున్న ఎన్నికలే అయినా.. ప్రధాన పార్టీలు బలపరుస్తున్న అభ్యర్థులే బరిలో నిలిచారు. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలపై ఆదరాభిమానాలు ఈ ఎన్నికలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఎన్నికల ద్వారా క్లారిటీ వచ్చిన మరో విషయం ఏంటంటే.. టీడీపీకి స్థానికంగా అభ్యర్థులే లేకపోవడం. దాదాపుగా అన్ని జిల్లాల్లో ఏకగ్రీవాలు మినహా మిగతా చోట్ల జరిగిన పోరాటం అంతా వైసీపీ వర్సెస్ వైసీపీ. పార్టీపై స్థానికంగా పట్టు నిలుపుకునేందుకు రెండు వర్గాలు తమ బలప్రదర్శన చేశాయంతే. ఈ బలప్రదర్శనల్లో టీడీపీ కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితమైంది. పంచాయతీల్లోనే ఇలా ఉంటే.. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైన మున్సిపోల్స్ లోనూ వైసీపీ ఘన విజయానికి అడ్డే ఉండదనేది ఆ పార్టీ నేతల అభిప్రాయం. 2019 ఎన్నికల్లో వైసీపీ తిరుగులేని మెజార్టీతో అధికారం దక్కించుకుంది. 151 ఎమ్మెల్యే సీట్లు, 22 ఎంపీ సీట్లు గెలుచుకుంది. అయినా సరే క్యాడర్ ఉందా.. లేదా అనే అనుమానం వ్యక్తం చేసేవాళ్లు విమర్శకులు. ప్రజల్లో వైఎస్ కు ఉన్న పేరు ప్రతిష్ఠలు, జగన్ పాదయాత్ర, ప్రజాకర్షక పథకాలతోనే వైసీపీ గద్దెనెక్కిందనే వ్యాఖ్యానాలు వినిపించాయి. కానీ ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో సత్తా చాటడంతో.. వైసీపీ క్యాడర్ క్షేత్రస్థాయిలో బాగా బలపడింది. ఇప్పటిదాకా లీడర్ బేస్ట్ పార్టీగా ఉన్న వైసీపీ.. క్యాడర్ బేస్ట్ పార్టీగా రూపాంతరం చెందింది. ప్రాంతీయ పార్టీల మనుగడకు ఎప్పుడైనా క్యాడరే కీలకం. ప్రజాకర్షక పథకాలు, భావోద్వేగాలు ఎక్కువ కాలం ఉండవు. పార్టీని కలకాలం నిలబెట్టేది విశ్వసనీయమైన పార్టీ క్యాడరే. గతంలో టీడీపీకి ఇలాంటి బలమైన క్యాడర్ ఉండేది. ఇప్పుడు స్థానిక ఎన్నికల ఫలితాలతో వైసీపీ కూడా క్షేత్రస్థాయిలో బాగా బలపడిన పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే వలంటీర్ల ద్వారా గ్రౌండ్ లెవల్లో ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయం ప్రభుత్వానికి తెలుస్తోంది. ఇప్పుడు పంచాయతీ, భవిష్యత్తులో మండల, జిల్లా స్థాయిలో కూడా అధికార పార్టీ ప్రజాప్రతినిధులుంటే.. వైసీపీ మరింత బలపడడం ఖాయంస్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తే.. వీలైనంత ఎక్కువ మంది కార్యకర్తలకు పదవులిచ్చి.. వాళ్లలో ఉన్న అసంతృప్తి కూడా పోతుంది. ఇప్పుడు 80 శాతానికి పైగా స్థానాల్లో వైసీపీ విజయం సాధించడంతో.. ఆ మేరకు క్యాడర్ కు పదవులు వచ్చినట్టే. అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా.. తమకు ఒరిగిందేమీ లేదనే నిరాశలో ఉన్న కొంత మంది క్యాడర్ కు.. స్థానిక ఎన్నికలతో కిక్ వచ్చినట్లైంది. భారీ విజయాలు వైసీపీ అగ్రనేతలకు సంతోషాన్నిచ్చాయి. చాలా మంది కార్యకర్తలకు పదవులు దక్కడంతో.. ఇక తమ దగ్గరకు వచ్చే పంచాయతీలు కూడా తగ్గుతాయని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి సానుకూల వాతావరణం కనిపించడం అధికార పార్టీకి కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ప్రభుత్వం వచ్చి రెండేళ్లైనా.. ప్రజల్లో జగన్ పై మోజు తగ్గలేదని ఫలితాలు నిరూపించాయని వైసీపీ చెబుతోంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఉండగా.. వైసీపీ ఘన విజయాలు సాధించలేదనే అపోహలు మొదట్లో ఉన్నాయి. కానీ ఎన్నికల ఫలితాల తో అవన్నీ పటాపంచలయ్యాయి. మొన్నటివరకూ జగన్ పథకాలపై అనుమానాలు వ్యక్తం చేసిన విపక్షాలు కూడా ఇప్పుడు సైలంటయ్యాయి. జగన్ పథకాల ప్రకటనలకే పరిమితమౌతున్నారని, డెలివరీ మెకానిజం సరిగ్గా లేదనే విమర్శలు నిజం కాదని తేలిపోయింది. మాజీ సీఎం చంద్రబాబు సొంత నియోజవర్గం దగ్గర్నుంచీ.. పలువురు టీడీపీ సీనియర్ల కంచుకోటల్లోనూ వైసీపీ జెండా ఎగరడంతో.. ఆ పార్టీ శ్రేణులు పండగ చేసుకుంటున్నాయి. స్థానిక ఎన్నికలే కదా అని వైసీపీ లైట్ తీస్కోలేదు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలకు బాధ్యతలు ఇవ్వడంతో పాటు.. జిల్లాలకు ఇంఛార్జ్ మంత్రుల్ని కూడా నియమించింది. స్థానిక ఎన్నికలకు కనీవినీ ఎరుగని రీతిలో వైసీపీ వ్యూహాలు రచించింది. గ్రామస్థాయి ఎన్నికలపై అగ్రనేతలు ఇంత ఫోకస్ పెట్టడం ఎప్పుడూ చూడలేదనే కామెంట్లు వినిపించాయంటే.. పంచాయతీ ఎన్నికల్ని వైసీపీ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థమవుతోంది. ఏపీలో కొత్త తరహా రాజకీయాన్ని ప్రజలకు పరిచయం చేయాలని, అందుకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే నాంది కావాలనే బలమైన సంకల్పం వైసీపీలో కనిపిస్తోంది.


# అవంతికి కలిసి రాని కాలం

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** మంత్రి అవంతి శ్రీనివాసరావుకు అవకాశం వచ్చింది. ఇప్పటి వరకు ఆయన.. ఒకింత వెనకబడినా.. ఇప్పుడు అందివచ్చిన వరంగా .. విశాఖ ఉక్కు అంశం కలిసి వచ్చింది. దీంతో మంత్రిని అనే భేషజం కూడా పక్కన పెట్టి.. రోడ్డెక్కారు. విశాఖ ఉక్కును ఎట్టి పరిస్థితిలోనూ తరలించేది లేదని.. అవసరమైతే.. ఎంత వరకైనా తాను వ్యక్తిగతంగా అయినా.. పోరాడతానని ప్రకటించారు. ఇక, నిత్యం విశాఖ ఉక్కు ఉద్యమంలో పాల్గొంటున్నారు. మీడియాతోనూ మాట్లాడుతున్నారు. ఇప్పటి వరకు దూరంగా ఉన్న వైసీపీ నాయకులను కూడా కలుపుకొని పోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అవంతి దూకుడు పెంచారనే టాక్ వినిపిస్తోంది. అయితే.. ఇక్కడ చిత్రమైన విషయం ఏంటంటే అవంతి శ్రీనివాసరావు ఇంత దూకుడు పెంచినా.. అవంతికి గుర్తింపు లేకుండా పోయిందని అంటున్నారు వైసీపీ నాయకులు. ఓ కీలక నాయకుడి ఆదేశాల మేరకు.. అవంతి వార్తలను పూర్తిగా పక్కన పెడుతున్నారట. అంతేకాదు.. ఆయన ఎంత విజృంభించినా.. స్తానిక నేతలు కూడా అంతంత మాత్రంగానే స్పందిస్తున్నారు. వస్తాం.. అదిగో ఇదిగో .. అంటూ.. ఫోన్లు చేస్తే.. స్పందిస్తున్నారు కానీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అవంతికి సహకరించడం లేదు. దీంతో అవంతి దూకుడు పెంచినా.. ఆయనకు గుర్తింపు మాత్రం రావడం లేదని చెబుతున్నారు. మరోవైపు.. టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు.. నామమాత్రంగా అయినా..(స్పీకర్ ఫార్మాట్‌లో కాకపోయినా) తన పదవికి రాజీనామా చేశారు. ఇదిబాగానే వర్కవుట్ అవుతోంది. గంటా రాజీనామా ఒక్కసారిగా హైలెట్ అవ్వడంతో పాటు ఆయన్ను మీడియాలో హీరోను చేసింది. ఇదే సమయంలో విశాఖలో మంత్రిగా ఉన్న అవంతి శ్రీనివాసరావు మాత్రం పదవిని పట్టుకుని వేలాడుతున్నారని .. గంటా పరోక్షంగా ప్రచారం చేయిస్తున్నారు. విశాక ఉక్కు ఉద్యమ కారులు దీనినే అడుగుతున్నారు. అవంతి శ్రీనివాసరావుకి నిజంగా ఉక్కు పరిశ్రమపై ప్రేమ ఉంటే.. ఖచ్చితంగా ఆయన తన పదవికి రాజీనామా చేయాలి కదా ? ఎందుకు చేయడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇంటా బయటా కూడా అవంతి శ్రీనివాసరావుకి సెగ తగులుతోందని అంటున్నారు పరిశీలకులు. అవంతి గతంలో టీడీపీలో ఉన్నప్పుడు అనకాపల్లి ఎంపీగా ఉన్నారు. అప్పుడు కూడా ఆయన విశాఖ రైల్వే జోన్ కోసం నిరాహార దీక్షలు చేసినా అప్పుడు హైలెట్ కాలేదు సరికదా ? తమ పార్టీ అధిష్టానమే ఆయన్ను పట్టించుకోలేదు సరికదా ? మా ఆదేశాలు లేకుండా మీరెందుకు నిర్ణయం తీసుకున్నారని చీవాట్లు పెట్టింది. ఉత్తరాంధ్రలో కీలక అంశాల విషయంలో ఆయన ఏదో చేసి హైలెట్ అవుదామనుకున్నా రెండు సార్లు ఆయనకు రావాల్సినంత గుర్తింపు రాకుండా పోయింది

# అనంతలో వేధిస్తున్న విద్యుత్ సిబ్బంది కొరత

**అనంతపురం, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** అవసరమైన విద్యుత్ సిబ్బంది లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, గ్రామస్తులు కరెంటు కష్టాలను ఎదుర్కొంటున్నారు. సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎస్పీడీసీఎల్) 'అనంత' విద్యుత్ సర్కిల్ పరిధిలో అనంతపురం, హిందూపురం, కదిరి, గుత్తి, కళ్యాణదుర్గం సబ్ డివిజన్లు ఉన్నాయి. జిల్లా విద్యుత్ శాఖలో మూడు ప్రధాన విభాగాలు ఉన్నాయి. ఇందులో 2,916 పోస్టులకు గానూ 917 ఖాళీగా ఉన్నాయి. లైన్‌మన్లతో పాటు అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్‌ఇంజనీర్లు, సీనియర్, లైన్‌మన్ డ్రైవర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, ఆఫీస్ సబార్టినేట్లు విభాగాల్లో ఎక్కువగా ఖాళీలు ఉన్నాయి. వివిధ విభాగాల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉండడంతో అటు ఆ శాఖ అధికారులు ఇటు వినియోగదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా లైన్‌మెన్ల కొరత వేధిస్తోంది. అసిస్టెంట్ లైన్‌మెన్లు 535 మంది ఉండాల్సి వుండగా 231 మంది పనిచేస్తున్నారు. జూనియర్ లైన్‌మెన్లు 449 మందికిగాను 168 మంది పనిచేస్తున్నారు. ఈ రెండు విభాగాల పరిధిలో 585 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సబ్‌ఇంజనీర్ల కొరత కూడా ఎక్కువగా ఉంది. విద్యుత్ ఫీజు పోతే వేసేవారు దిక్కులేరు. పెనుగాలులు, ఇతరత్రా ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా విద్యుత్ సరఫరా ఆదిపోయన సందర్భంలో పునరుద్ధరణకు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. కొన్ని సందర్భాల్లో రైతులే ఫీజులు వేసేందుకు యత్నించి మృత్యుపాలైన సంఘటనలు లేకపోలేదు. రాష్ట్ర విభజన తర్వాత నియామకాలు పూర్తిగా నిలిచిపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆ శాఖ అధికావర్గాలు చెబుతున్నాయి.

# కాణిపాకం ఆలయంలో భద్రత పటిష్టం




**చిత్తూరు ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిఘా వ్యవస్థను ఆలయ ఈవో వెంకటేశు పటిష్టం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల తోపాటు తమిళనాడు, కర్ణాటక మధ్యన కాణిపాకం పుణ్యక్షేత్రం ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అలాగే దేశవిదేశాల నుండి భక్తులు వస్తుంటారు. ఆలయ భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు ఆలయ ఈవో ప్రత్యేక దృష్టి సారించారు. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాల దృశ్యాల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ తో అనుసంధానం చేశారు. ఈ సంద ర్భంగా ఈవో వెంకటేశు మీడియాతో మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో నిఘా వ్యవస్థను పటిష్ట పరుస్తున్నా మని తెలిపారు. ఇందుకోసం 44 సీసీ కెమెరాలను ఆలయంతో పాటు నాలుగు మాడ వీధులు, ఆలయ అనుబంధ ఆలయమైన శివాలయం, వరదరాజుల స్వామి ఆలయం, వాహన పూజ, వినాయక సదన్ గణేష్ సాదన్, బస్టాండు ప్రాంతాల్లో అమర్చడం జరిగిందన్నారు. అలాగే రథం మండపం వద్ద హోం గార్డులను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు ఇందుకోసం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పర్యవేక్షించేందుకు మూడు షిఫ్టులుగా సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# ఒక్కసారి పడిపోయిన నిమ్మ ధర

**ఏలూరు, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** నిమ్మసాగులో రైతులు పండించిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. మార్కెట్లో ఒక్కసారిగా ధర పతనం కావడంతో లాభాలుకాదుగా కనీసం పెట్టుబడులు కూడా వచ్చే దారి లేక రైతులు విలవిల్లాడుతున్నారు. పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా లాభదాయకంగా మారిన నిమ్మ పంట ప్రస్తుతం గిట్టుబాటు ధర దక్కక నష్టాల పాలవుతున్నామని రైతులు వాపోతున్నారు. గత డిసెంబరు వరకూ రూ.నాలుగు వేల నుంచి రూ.ఆరు వేల వరకూ పలికిన నిమ్మకాయలు బస్తా కేవలం రూ.వెయ్యికి పడిపోయింది అంటేనే ధర పతనం ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది. చేసిన అప్పుల నుంచి గట్టెక్కేదెలాగో తెలియక రైతులు, కౌలుదారులు లబోదిబోమంటున్నారు. సరైన గిట్టుబాటు ధర కల్పించి నిమ్మరైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. మండలంలో ప్రధానంగా



టి.నరసాపురం, శ్రీరామవరం, కాపుగూడెం, పుట్రేపు తదితర గ్రామాల్లో రైతులు అధికంగా నిమ్మసాగు చేస్తున్నారు. 346 మంది రైతులు 1563 ఎకరాల్లో బాలాజీ, దేశవాళీ వంటి రకాల నిమ్మ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం తొమ్మిదొందల ఎకరాల్లో కాపు వస్తుంది. మిగిలినవి మొక్కదశలో ఉన్నాయి. ఎకరానికి అధికంగా ఐదారు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మండలంలో రైతులు పండించిన నిమ్మకాయలను ఏలూరు మార్కెట్‌కు తరలిస్తుంటారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తుండటంతో కొందరు రైతులు జామాయిల్, జీడిమామిడి వంటి తోటలను తీసేసి పూర్తిగా సాగునే ఎంచుకున్నారు. దీంతో మండలంలో 500 ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం 15 వందలకు పెరిగింది. పంటకు గిట్టుబాటు ధర కిలో రూ.50, రూ.60 పలికిన రోజుల్లో ఎకరానికి రూ.1.5 లక్షల నుండి రూ.రెండు లక్షల వరకు ఆదాయం వచ్చేదని రైతులు చెబుతున్నారు. లాభాలు ఆశించిన కొందరు సాగు మానేసి నిమ్మతోటలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. గతేడాది నిమ్మ పంట ఆశాజనకంగా మారడంతో మండలంలో సాగు విస్తీర్ణం పెరగడమే కాకుండా కౌలుధరలు కూడా బాగా పెరిగాయి. దీంతో ఎకరానికి రూ.లక్ష నుండి లక్షా యాభై వేల వరకు కౌలు వెచ్చించి కౌలుదారులు భారీగా నిమ్మ తోటలను కౌలుకు తీసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ధర పతనం కావడంతో కేవలం బస్తా రూ.ఆరొందల నుంచి రూ.వెయ్యి మాత్రమే పలుకుతుందని, కనీసం కూలీల ఖర్చులు కూడా రావడం లేదని శ్రీరామవరానికి చెందిన రైతు సాధనాల బూసిబాబు చెబుతున్నారు. ఎకరానికి రూ.లక్షా 20 వేలు కౌలుతోపాటు రూ.50 వేల పెట్టుబడితో కలిపి ఆరు ఎకరాలకు రూ.9.20 లక్షలు అప్పులు చేశానని, ప్రస్తుతం ఉన్న ధరతో అప్పు తీరే పరిస్థితి లేదని వాపోయారు. దీనికి ప్రత్యామ్నాయంగా వేరే సాగుకూ అవకాశం లేదని తెలిపారు. ప్రభుత్వం నిమ్మ పంటకు గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని నిమ్మ రైతులు కోరుతున్నారు. 16 సంవత్సరాలుగా శ్రీరామవరంలో నాకున్న రెండెకరాలతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని నిమ్మ సాగు చేస్తున్నాను. ఎరువుల ధరలు పెరగడంతో సాగుకు పెట్టుబడులు బాగా పెరిగాయి. ఎకరానికి రూ.50 వేలు చొప్పున కౌలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుని, అప్పు చేసి రూ.10 లక్షలు వరకూ ఖర్చు పెట్టా. గత డిసెంబరు నుండి నిమ్మకాయలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలొచ్చాయి. కూలీల ఖర్చు కూడా రావడం లేదు. అప్పు తీర్చే మార్గం కానరావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. నిమ్మసాగు లాభసాటిగా ఉండటంతో పుట్రేపులో రెండెకరాల నిమ్మ తోట కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. గతేడాది లాభాలు బాగానే వచ్చాయి. ప్రస్తుతం నిమ్మ ధర తగ్గిపోయింది. కిలో రూ.40 నుంచి రూ.50 పలికే ధర కాస్తా ప్రస్తుతం రూ.12 నుంచి రూ.15 మాత్రమే పడుతుంది. ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

# ఒట్టు తీసి గట్టున పెట్టిన జగన్

**విజయవాడ, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** ఏపీలో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తాను అంటూ పట్టుబట్టిన రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ చివరికి తన పంతం నెగ్గించుకున్నారు. ఆయన కరోనా టైంలో ప్రభుత్వానికి చెప్పకుండా ఎన్నికలు ఒక్కసారిగా నాడు వాయిదా వేశారని ముఖ్యమంత్రి జగన్ అహం దెబ్బతింది. దాంతో ఏడాది పాటు సాగిన కథ అంతా ఇగోల మీదనే ఫోకస్ అయిందని అందరికీ తెలుసు. అయితే సుప్రీం కోర్టు తీర్పుతో ఇష్టం లేకపోయినా జగన్ ఎన్నికలకు ఓకే చెప్పారు. తొలి విడత పంచాయతీ ఫలితాల తరువాత జగన్ లో కూడా మార్పు వచ్చింది అంటున్నారు. ఇక అటు నిమ్మగడ్డ రమేష్ కుమార్ కూడా ప్రభుత్వంతో సాన్నిహిత్యం పెంచుకున్నారు. ఇలా రెండు వైపులా సామరస్య వాతావరణం ఉండడంతో జగన్ మాట తప్పేశారు అంటున్నారు. నిమ్మగడ్డ ఉండగా స్థానిక ఎన్నికలను జరిపించను అంటూ ఒట్టేసుకుని కూర్చున్న జగన్ ఇపుడు అన్ని ఎన్నికలనూ పెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందంటూ లిఖితపూర్వకమైన అంగీకారం కూడా తెలిపారు. దీనికి కారణాలు చాలానే ఉన్నాయని అంటున్నారు. ఏపీలో ఇరవై నెలల జగన్ పాలన మీద జనానికి మోజు బాగానే ఉందని, పెద్దగా వ్యతిరేకత రాలేదని ఫలితాల సరళిని బట్టి వైసీపీ పెద్దలకు అర్థమైందట. దాంతో నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఉన్నా మరొకరు ఉన్నా కూడా తప్పని ఎన్నికలకు ఇపుడే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తే పోలా అని ఓకే అనేశారట. నిజానికి నిమ్మగడ్డ రమేష్ కుమార్ కు ఎన్నికలు నిర్వహించాలని పంతం ఉండడం చివరికి వైసీపీకే కలసి వచ్చిందని అంటున్నారు. ఇపుడు చూస్తే ఇంకా శీతాకాలం ఉంది. రాష్ట్రంలో సమస్యలు కూడా పెద్దగా లేవు. కరోనా తగ్గింది. జనాలు కూడా ఇప్పటికైతే ఏ రకమైన ఇబ్బంది లేకుండా ఉన్నారు. ఈ టైంలో ఎన్నికలు పెట్టడం వల్ల ప్రభుత్వానికే సానుకూలంగా ఓటింగ్ జరుగుతుంది అంటున్నారు. అదే జగన్ అనుకున్నట్లుగా ఏ వేసవి లోనో లేక ఈ ఏడాది చివరలోనే ఎన్నికలు పెట్టి ఉంటే కచ్చితంగా అవి వైసీపీకి రివర్స్ అయి ఉండేవని విశ్లేషణలు ఉన్నాయి. వేసవిలో కరెంట్ కోతలతో పాటు నీటి కష్టాలు ఇతర సమస్యలు కూడా పెరిగి సర్కార్ కే పెద్ద దెబ్బ పడేది అంటున్నారు. స్థానిక ఎన్నికల సమయంలోనే తిరుపతి ఉప ఎన్నిక కూడా జరుగుతుంది. ఈ మొత్తం టైంలో ఎన్నికల వేళ నిబంధనల రూపంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. దాంతో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరిగేందుకు వీలు లేదు. ఇపుడూ ఎటూ ఎన్నికల మీద ఎన్నికలు అన్నీ ఒకేసారి జరిపించేస్తే ఒక్క దెబ్బకు అన్నీ పూర్తి అవుతాయి. దాంతో రానున్న మూడేళ్ళ కాలంలో డేరింగ్ గా నిర్ణయాలు తీసుకోవచ్చునని వైసీపీ సర్కార్ ఆలోచిస్తోందిట. మరో వైపు పార్టీలోని క్యాడర్ కూడా క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పదవులతో కుదురుకుంటారని, మరింతగా గ్రాస్ రూట్ లెవెల్ లో కూడా వైసీపీ పటిష్టం అవుతుంది అని కూడా అంచనాలు వేసుకుంటున్నారుట. మొత్తానికి నిమ్మగడ్డ రమేష్ కుమార్ దూకుడే ఇపుడు వైసీపీకి కోరకుండానే వరం అయిందని పార్టీ నేతలు లోలోపల సంతోషిస్తున్నారుట.

# కమలానికి దగ్గరవుతున్న దేవగౌడ




**బెంగళూర్, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** మొన్నటి వరకూ అధికారంలో ఉన్న పార్టీ వద్ద డబ్బుల్లేవట. నిధులు లేమి పార్టీని పట్టిపీడిస్తుందట. ఈ మాటలు అన్నది ఎవరో కాదు. జనతాదళ్ ఎస్ అధినేత దేవెగౌడ. త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో తమ పార్టీ నుంచి ఎవరూ పోటీకి దిగడం లేదని దేవెగౌడ ప్రకటించడం రాజకీయంగా సంచలనంగా మారింది. కేవలం నాలుగు నియోజకవర్గాలకు జరిగే ఉప ఎన్నికలకు డబ్బులు లేకపోవడం కారణంగా చూపడం నమ్మశక్యంగా లేదు.సాధారణ ఎన్నికలయితే నిధుల సమస్య తలెత్తుతుంది. అదే ఉప ఎన్నికల్లో అయితే పార్టీ అభ్యర్థి ఎన్నికల ఖర్చును భరాయిస్తారు. పార్టీ పెద్దగా ఎన్నికల ఖర్చును పట్టించుకోదు. కానీ దేవెగౌడ డబ్బులు లేకపోవడంతోనే పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించామని చెప్పడం ఆ పార్టీలోనే చర్చకు దారితీసింది. ఉప ఎన్నికలకే ఇలా చేతులెత్తేస్తే మరో రెండున్నరేళ్లలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని ఎలా పరుగులు తీయిస్తారన్న సందేహాలు పార్టీ నేతల్లో తలెత్తుతున్నాయి.కర్ణాటకలో త్వరలో ఒక లోక్ సభ, మూడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. బెళగావి లోక్ సభతో పాటు బసవ కల్యాణ్, సింధి, మస్కి అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. దేవెగౌడ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపకపోవడానికి కారణాలపై అనేక విశ్లేషణలు వెలువడుతున్నాయి. బీజేపీకి లాభం చేకూర్చడం కోసమే దేవెగౌడ ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా అంటున్నారు. కొంతకాలంగా దేవెగౌడ కుమారుడు కుమారస్వామి బీజేపీకి దగ్గరవుతున్నారు. బసవకల్యాణ్ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి యడ్యూరప్ప కుమారుడు పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాలతో పాటు లోక్ సభ నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో యడ్యూరప్పకు విజయం అవసరం. అందుకోసమే దేవెగౌడ పార్టీ ఉప ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించిందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. భవిష?యత్ లోనూ బీజేపీకి దగ్గరవ్వడానికి దే?వెగౌడ ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నట్లుంది.

# కడపలో టీడీపీ దూకుడు

**కడప, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** కడప అంటేనే.. వైసీపీకి పెట్టనికోటగా ప్రచారంలో ఉంది. అందరూ దీనిని ఒప్పుకొంటారు కూడా. గత అ సెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. ఇక, ప్రతిపక్షం టీడీపీ జిల్లాలో అడ్రస్ కూడా లేకుండా పోయింది. అంతేకాదు.. గత ఎన్నికల తర్వాత.. టీడీపీ కీలక నేతలు గుండుగుత్తుగా పార్టీ మారి.. తలో దిక్కూపోయారు. దీంతో కడపపై చంద్రబాబు.. ఆయన పరివారం అంతా కూడా ఆశలు వదులుకున్నారు. అయితే.. అనూహ్యంగా ఇప్పుడు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కడపలో టీడీపీ మద్దతు దారులు అనూహ్య విజయం సాధించడం.. టీడీపీలో ఆశలు రేకెత్తిస్తుండగా.. వైసీపీలో మాత్రం గుబులు రేపుతుండడం గమనార్హం. టీడీపీ గెలుచుకున్న సర్పంచ్ స్థానాల సంఖ్య తక్కువే అయినా ఆ పార్టీ గెలుచుకున్నవి అన్నీ కీలక స్థానాలే కావడం విశేషం.తొలి విడతలో ఏకగ్రీవాలు పోనూ 155 సర్పంచి స్థానాలకు ఎన్నికలు జరిగితే టీడీపీ మద్దతుదారులు 98 స్థానాలకు పోటీ చేశారు. 30 స్థానాల్లో విజయం సాధించడం గమనార్హం. జిల్లాలో ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో తొలి దశ పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు.. టీడీపీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాయి. తొలివిడతలో 206 పంచాయతీలకు ఎన్నికలు జరిగితే 51 సర్పంచి స్థానాలు ఏకగ్రీవ మయ్యాయి. 155 సర్పంచి స్థానాలకు పోటీ జరిగింది. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 19 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. టీడీపీ మద్దతుదారులు 8 పంచాయతీల్లో మాత్రమే పోటీ చేసి 5 స్థానాల్లో గెలిచారు.బద్వేలు నియోజకవర్గంలో 68 పంచాయతీలకు ఎన్నికలు జరిగితే 44 స్థానాల్లో టీడీపీ పోటీ చేసింది. అందులో 12 స్థానాల్లో విజయం సాధించింది. జిల్లా వ్యాప్తంగానే తీవ్ర ఉత్కంఠ రేపిన పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలో టీడీపీ అభ్యర్థి సుథాకర్ నాయుడు 300 ఓట్ల మెజార్టీతో గెలిచి ప్రకంపనలు రేపారు. మైదుకూరు నియోజకవర్గంలో టీడీపీ మద్దతుదారులు 46 స్థానాల్లో పోటీ చేసి 10 పంచాయతీలను కైవసం చేసుకున్నారు.పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను అధికార వైసీపీ తన ఖాతాలో వేసుకున్నా.. తక్కువ స్థానాల్లో పోటీ చేసి అధికార పార్టీని ఎదురొడ్డి 27.55 శాతం స్థానాలు దక్కించుకోవడం తెలుగుదేశం నేతల్లో హుషారు నింపిందనడంలో సందేహం లేదు. అయితే.. తమకు పట్టు కొమ్మగా ఉన్న జిల్లాలో అందునా.. సీఎం సొంత జిల్లాలో పదేళ్లుగా టీడీపీకి అస్సలు ప్రాతినిధ్యం లేకుండా ఇలా టీడీపీ దూకుడుతో ముందుకు సాగడం అధికార పార్టీ నేతలకు నోట మాట లేకుండా చేసిందనడంలో సందేహంలేదు

# మళ్లీ కలవరపెడుతున్న కరోనా



**ముంబై, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** దేశంలో కరోనా మరోసారి డేంజర్ బెల్స్ మోగిస్తోంది. కరోనా సోకిన వారు కోలుకుంటుండడం, వైరస్ విస్తరణ తగ్గడం, వ్యాక్సిన్ పంపిణీ వేగవంతమవడంతో ఇక కరోనా మహమ్మారి భయం తొలగిపోయిందని భావిస్తున్న వారు ఉలిక్కి పడే అంశాలు మంగళవారం వెలుగులోకి వచ్చాయి. కొన్ని రాష్ట్రాల్లో కరోనా నియంత్రణలోకి వచ్చినా.. కీలక రాష్ట్రాలలో కరోనా మళ్ళీ విజృంభిస్తోంది. ముఖ్యంగా మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలలో కరోనా కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. చాలా రోజుల తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం కరోనా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. పీఎంఓలో నిర్వహించిన ఈ సమీక్ష సమావేశానికి ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ హాజరయ్యారు. తాజా పరిస్థితిపై ప్రధానికి నివేదిక సమర్పించారు.దేశంలో కరోనా వైరస్ విస్తరణపై తాజా పరిస్థితిని మోదీకి అధికారులు వివరించారు. కొత్త రకం కరోనా వ్యాప్తిపై చర్చించారు. వ్యాక్సిన్ పంపిణీని వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మోదీ చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ప్రైవేటు సంస్థల ద్వారా వ్యాక్సిన్ పంపిణీ చేస్తే మరింత వేగంగా దేశ ప్రజలకు వ్యాక్సిన్ అందుతుందన్న సూచనలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. రెండు నెలల వ్యవధిలో 50 కోట్ల మంది ప్రజలకు వ్యాక్సిన్ అందేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశాలిచ్చినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.కేరళ, మహారాష్ట్రల్లో రోజువారీ కేసులు రికార్డు స్థాయిలో నమోదవుతున్న విషయం ప్రస్తుతం ఆందోళన రేపుతోంది. దేశంలో మొత్తం నమోదైన రోజువారీ కేసుల్లో దాదాపు 75 శాతం ఈ రెండు రాష్ట్రాల్లోనే ఉంటున్నాయి. జనవరిలో తగ్గుముఖం పట్టిన కరోనా ఫిబ్రవరి తొలి వారం నుంచి మళ్ళీ పెరుగుతూ వస్తోంది. దాంతో రోజూ వారీ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దాంతో ఈ రెండు రాష్ట్రాల్లో యాక్టివ్ కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య యాభై వేల మార్కును దాటింది. ఈ రెండు రాష్ట్రాలతోపాటు పంజాబ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో ఆయా రాష్ట్రాలు అలర్టయ్యాయి. కాగా దేశ వ్యాప్తంగా కోటి 17 లక్షల 54 వేల 788 డోసుల కరోనా వ్యాక్సిన్ పంపిణీ జరిగిందని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. తొలి డోసు కోటి 4 లక్షల 93 వేల 205 మందికి ఇవ్వగా.. 12 లక్షల 61 వేల 583 మందికి రెండో డోసు వ్యాక్సిన్ పంపిణీ జరిగింది. 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 75 శాతానికిపైగా హెల్త్ వర్కర్లకు వ్యాక్సిన్ చేరింది. తొమ్మిది రాష్ట్రాల్లో 60 శాతం ఫ్రంట్ లైన్ ఫైటర్స్‌కు వ్యాక్సిన్ ఇచ్చారు. అయితే వ్యాక్సిన్ పంపిణీని ప్రైవేటు సంస్థల ద్వారా చేస్తే మరింత వేగంగా వ్యాక్సిన్ ప్రజలకు చేరుతుందన్న సూచనలు ప్రస్తుతం కేంద్రం ముందుకు వస్తున్నాయి. ఈ విషయంపై మంగళవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కరోనా సమీక్ష లో చర్చించినట్లు తెలుస్తోంది. వేగంగా వ్యాక్సిన్ పంపిణీ జరగాలంటే తీసుకోవాల్సిన చర్యలపై మోదీ సమాలోచనలు జరిపి, కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాజాగా కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య లక్షన్నర కంటే తక్కువగా వుంది. కానీ కేరళలో 55 వేలు, మహారాష్ట్రలో 54 వేలు వుండడం ఆందోళన కలిగించే విషయం. కేరళలో అక్కడి ప్రభుత్వం కరోనాను సమర్థవంతంగా నియంత్రిస్తోందంటూ తొలి రోజుల్లో కథనాలు వచ్చినా.. ఆ కథనాల్లోని డొల్లతనం ఇపుడు బహిర్గతమవుతోంది. మరోవైపు జనసాంద్రత అధికంగా వుంటే ముంబై మహానగరంలో ఇటీవల లోకల్ రైళ్ళను ప్రారంభించడం కరోనా కేసుల పెరుగుదలకు కారణమైందని తెలుస్తోంది.మళ్ళీ విజృంభిస్తున్న కేరళ, మహారాష్ట్ర, పంజాబ్‌లలో పరిస్థితులను సమీక్షించేందుకు కేంద్ర బృందాలను పంపించాలని ప్రధాన మంత్రి ఆదేశించారు. మహారాష్ట్రలో మరోసారి కొన్ని ప్రాంతాల్లో వారం రోజుల పాటు లాక్ డౌన్ విధించిన అంశాన్ని ప్రధాన మంత్రి సమీక్షించారు. ఆయా ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కేంద్ర ఆరోగ్య శాఖకు మోదీ ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర, కేరళ ప్రభుత్వాలతో సమిష్టిగా పని చేసి కరోనానను నియంత్రించాలని, వ్యాక్సిన్ పంపిణీని వేగవంతం చేయాలని మోదీ సూచించినట్లు సమాచారం. దేశంలో కరోనా ప్రభావం మొదలై పదకొండు నెలలు కావస్తోంది. సెప్టెంబర్, 2020లో దేశంలో కరోనా కేసుల సంఖ్య గరిష్ట స్థాయికి చేరింది. ఆ తర్వాత నవంబర్ నుంచి దేశంలో కరోనా తగ్గుముఖం పట్టడంతో మెల్లిగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. వాణిజ్య సముదాయాలు ప్రారంభమయ్యాయి. రవాణా వ్యవస్థ సాధారణ స్థాయికి చేరుకుంటోంది. సినిమా థియేటర్లు ఓపెనయ్యాయి. కొన్ని షరతులకు లోబడి విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. వ్యాక్సిన్ పంపిణీ జనవరి 16న ప్రారంభం కావడంతో ప్రజల్లో కరోనాపై భయాందోళన కనిష్ట స్థాయికి చేరుకుంటోంది. ఈ నేపథ్యంలోనే మరోసారి కరోనా వైరస్ విజృంభిస్తోందన్న వార్తలు ప్రజల్లో మరోసారి టెన్షన్ పెంచుతున్నాయి.కరోనా ప్రభావం పూర్తిగా తొలగి పోయే దాకా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించినట్లుగా మాస్కులను ధరించడం, సామాజిక దూరాన్ని పాటించడం, శానిటైజర్లను వాడడం వంటి పక్కన పెట్టొద్దని వైద్య వర్గాలు సూచిస్తున్నాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా మరోసారి కరోనా ప్రబలడం ఖాయమని వారంటున్నారు. దానికి తోడు కరోనా వైరస్ కొన్ని వేల పరిణామాలను దాటిందని తాజాగా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సీసీఎంబీ పరిశోధన ప్రకారం కరోనా వైరస్ కొన్ని వేల రూపాంతరాలకు గురైందని.. ఏ వెరైటీ ఎంత తీవ్రంగా మానవ శరీరంపై ప్రభావం చూపుతుందన్నది అంఛనా వేయడం ఇప్పటికిప్పుడు కష్టమని తేలింది. ఈ నేపథ్యంలో అప్రమత్తత ఒక్కటే సరైన మార్గమని వైద్య వర్గాలు సూచిస్తున్నాయి.

# తిరుపతిలో పోటీకి జనసేన




**తిరుపతి, ఫిబ్రవరి 24 (ప్రజాపాలన) :** పవన్ కల్యాణ్ జనసేన అభ్యర్థిని బరిలోకి దింపాలని గట్టిగా కోరుకుంటున్నారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో జనసేన అభ్యర్థి ఉండాలని పవన్ కల్యాణ్ గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. తిరుపతి ఉప ఎన్నికపైన ఇప్పటికి రెండు సార్లు పవన్ కల్యాణ్ ఢిల్లీ వెళ్లి వచ్చారు. అధిష్టానం పెద్దలను కలిశారు. తమ పార్టీ క్యాడర్ జనసేన అభ్యర్థి బరిలో ఉండాలని బలంగా కోరుకుంటున్నారని, ఈసారి అవకాశం ఇవ్వాలని పవన్ కల్యాణ్ కోరి వచ్చారు.రెండు సార్లు ఢిల్లీ వెళ్లిందీ పవన్ కల్యాణ? తిరుపతి ఉప ఎన్నికల విషయంలో స్పష్టత కోసమే. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ అందులో ఒకటి కావచ్చు కాని పవన్ కల్యాణ్ ప్రాధాన్యత మాత్రం తిరుపతి ఉప ఎన్నికే. ఇప్పటికే జనసేన అధినేత తిరుపతిలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి క్యాడర్ అభిప్రాయాలను తెలుసుకున్నారు.

తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలో ఉన్న ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో బీజేపీ కంటే జనసేన బలంగా ఉందని పవన్ కల్యాణ్ సయితం అధిష్టానానికి చెప్పినట్లు తెలుస్తోంది.బీజేపీ రాష్ట్ర నేతలు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా తిరుపతిలో తాము పోటీ చేయడానికి అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు అభ్యర్థుల పేర్లను వరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. సోము వీర్రాజు తిరుపతి ఉప ఎన్నికపైనే ప్రధానం గా దృష్టి పెట్టి నట్లు చెబుతున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు దాసరి శ్రీనివాసులు, రత్నప్రభల పేర్లను పరిశీలిస్తున్నారు. పవన్ కల్యాణ్ ఢిల్లీ పెద్దలను కలిసి వచ్చినా చివరకు తమ పార్టీ అభ్యర్థి ఖరారవుతారన్న విశ్వాసంతో ఉన్నారు.దీంతో మార్చి మొదటి వారంలో అమిత్ షా తిరుపతికి రానున్నారు. ఈ సమావేశంలో అభ్యర్థి ఎవరనేది తేల్చనున్నారు. పవన్ కల్యాణ్ మాత్రం ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత జనసేన అభ్యర్థి బరిలో ఉంటారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అయితే పార్లమెంటు ఎన్నిక కావడంతో తామే పోటీ చేయాలని బీజేపీ నేతలు కూడా గట్టిగా పట్టుబడుతున్నారు. మొత్తం మీద ఈసారైనా పవన్ కల్యాణ్ తన అనుకున్నది సాధిస్తారా? లేదా బీజేపీ నేతల ఆదేశాలను పాటిస్తారా? అన్నది చూడాల్సి ఉంది.

# తూర్పులో తమ్ముళ్లు.... బ్యాక్ స్టెప్స్



**కాకినాడ, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** ప్రధాన ప్రతిపక్షం టీడీపీకి అత్యంత కీలకమైన జిల్లా తూర్పుగోదావరి. ఈ జిల్లాలో అనేక మంది కీలక నేతలు ఉన్నారు. 2014లో క్లీన్ స్వీప్ చేసిన ఈ జిల్లాలో గత ఎన్నికల్లోనూ కేవలం నాలుగు స్థానాలు మాత్రమే దక్కించుకుంది. అయితే.. ఇప్పుడు పంచాయతీ పరుగులో మాత్రం టీడీపీ సైకిల్ ఘోరంగా వెనుకబడింది. పంచాయతీ పోరులో మొత్తం 336 పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. అయితే.. మెజారిటీ సంఖ్యలో పంచాయతీలను సొంతం చేసుకుంటామని.. టీడీపీ నాయకులు ఆది నుంచి చంద్రబాబుకు చెబుతున్నారు. చంద్రబాబు సైతం తూర్పులో సత్తా చాటాలని పార్టీ నేతలను వీడియో కాన్ఫరెన్స్‌లో రోజూ ఊదరగొడుతూ వచ్చారు. తొలి విడతలో వచ్చిన రిజల్ట్ చూస్తే టీడీపీ వాళ్ల మతులు పోయాయి. తొలి విడతలోనే 263 చోట్ల వైసీపీ మద్దతుదారులు విజయం సాధించారు. టీడీపీకి కేవలం 50 సర్పంచ్ స్థానాలు దక్కాయి.క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే వైసీపీ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో పలు పంచాయతీల్లో. టీడీపీకి నామినేషన్లు వేసేందుకు కూడా సరైన నేతలు లేని దుస్థితి ఎదురైంది. పార్టీ ఆవిర్భవించిన ఇన్నేళ్లలో ఈ జిల్లాలో క్షేత్రస్థాయిలో పార్టీ ఎప్పుడూ ఇంత దుస్థితి ఎదుర్కోలేదు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు రంగంలోకి దిగినా కూడా పార్టీ వీరాభిమానులు నామినేషన్లు వేయలేదని పార్టీ నేతలే చెప్పుకుంటున్నారు. ఇక టీడీపీ భారీగా పంచాయతీలు కోల్పోగా.ఆ పార్టీ గెలిచిన స్థానాల్లో కూడా మెజార్టీలు చాలా స్వల్పంగా ఉన్నాయి. టీడీపీకి కేవలం 50 పంచాయతీలు మాత్రమే వచ్చాయని మీడియా లెక్కలు చెపుతుంటే ఆ పార్టీ గణాంకాలు మాత్రం 120 అని చెపుతున్నాయి.తొలి విడత ఎన్నికలు జరిగిన చోట్ల కాకినాడ రూరల్, పెద్దాపురం నియోజకవర్గాల్లో టీడీపీకి జనసేన మద్దతుదారుల నుంచి గట్టి దెబ్బ తగిలింది. మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఎమ్మెల్యేగా ఉన్న పెద్దాపురం, మరో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తుని నియోజకవర్గాల్లో నామమాత్ర స్థాయిలో కూడా టీడీపీ పోటీ ఇవ్వలేదు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జిల్లాను శాసించిన ఈ ఇద్దరు మంత్రులు పంచాయతీ ఎన్నికలను పట్టించుకోలేదు సరికదా ? కనీసం పార్టీ నేతలకు దశ దిశ నిర్దేశం కూడా చేయలేదు. పిఠాపురంలో టీడీపీ పూర్తిగా బేజారే అయ్యింది.పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నాలుగు రాళ్లు వెనకేసుకున్న కీలక నేతలు సైతం తమ నియోజకవర్గాల్లో స్థానిక ఎన్నికలు జరిగితే స్థానిక నేతలకు పైసా విదల్చని దుస్థితి. ఏదేమైనా టీడీపీకి పట్టున్న జిల్లాలోనే అతి పెద్ద జిల్లాలోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడడంపై చంద్రబాబు సైతం విస్మయం వ్యక్తం చేశారట. ఓ మాజీ మంత్రి అయితే నడుం వెనక చేతులు పెట్టుకుని పేరు పోయినా పెద్దరికం నటిస్తూ? పసలేని మాటలతో కాలం గడుపుతూ పార్టీని నాశనం చేస్తున్నారని జిల్లా నేతలు వాపోతున్నారు. కొసమెరుపు ఏంటంటే.. ఈ ఫలితం వెలువడిన తర్వాత ఆయన మీడియాకు సైతం చిక్కకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకోవడం గమనార్హం.

# గేమ్ ఛేంజర్స్‌గా శ్రీనులు

**విజయవాడ, ఫిబ్రవరి 24, (ప్రజాపాలన) :** విశాఖ జిల్లా రాజకీయాల్లో శ్రీనులు ఎక్కువ. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలోనే శ్రీనులంతా సర్దుకున్నారు. వైసీపీలోని అవంతి శ్రీనివాసరావు జంప్ చేసి మంత్రి అయ్యాక అటూ ఇటూ పొలిటికల్ సీన్ కూడా మారింది. ఇక టీడీపీ వైపు నుంచి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఉంటే వైసీపీ నుంచి అవంతి శ్రీనివాసరావు ఉంటూ ఇప్పటిదాకా రాజకీయ రచ్చ చేస్తూ వచ్చారు. అటు నుంచి ఒకటి అంటే ఇటు నుంచి మరోటి అన్నట్లుగా విశాఖ పాలిటిక్స్ ని హీటెక్కించారు.ఒక దశలో గంటా శ్రీనివాసరావు వైసీపీలోకి వస్తారని ప్రచారం గట్టిగా జరిగింది. కానీ ఆయన రాకను మాజీ సన్నిహితుడు అవంతి శ్రీనివాసరావే బాహాటంగా వ్యతిరేకించారు. గంటాకు అధికార దాహమని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి మద్దతు ఇస్తారని కూడా విమర్శించారు. జగన్ కి గంటాను తీసుకోవాలని ఉన్నా కూడా అవంతి వ్యతిరేకతను చూసి వెనక్కి తగ్గారని చెబుతారు. ఇపుడు అటువంటి గంటా అవంతి చెట్టాపట్టాలు వేయడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేటీకరించవద్దు అంటూ సాగిన పోరాటంలో ఇద్దరు నేతలు కలసి ఒకే వేదిక మీద పాలు పంచుకోవడం మాత్రం అందరి దృష్టిని ఆకట్టుకుంది.రాజకీయాల్లో ఎపుడు ఏది జరుగుతుంది అన్నది చెప్పలేం. గంటా శ్రీనివాస్ అయిన చతురత తెలిసిన రాజకీయ నేత. ఆయన తన దారిని సుగమం చేసుకునేదుకు ఎంతదాకా అయినా వెళ్తారు అన్న మాట ఉంది. అదే సమయంలో ఆయన తన ఒకప్పటి సన్నిహితుడు అవంతి తో కలసి పనిచేయడానికి కూడా రెడీ అవుతారు అంటున్నారు. అవంతి కనుక ఎస్ అని చెబితే ఆ మరుక్షణం వైసీపీలోకి గంటా రాక చాలా ఈజీగా జరిగిపోతుంది అంటున్నారు. ఇక గంటా విషయానికి వస్తే టీడీపీ ద్వారా వచ్చిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మరీ జగన్ చెప్పినట్లుగానే నడచుకున్నారని అంటున్నారు.ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు అంటారు. ఇద్దరు శ్రీనులూ ఒకే పార్టీలో ఉండడమూ కష్టమే. గంటా శ్రీనివాస్ కనుక వైసీపీలోకి వస్తే కచ్చితంగా తనకు ఇబ్బంది అని అవంతికి స్పష్టంగా తెలుసు. అందుకే ఆయన ఎంత పాత స్నేహితుడు అయినా ఖరాఖండీగానే ఉంటున్నారు. కానీ విశాఖ ఉక్కు ఉద్యమం ఇపుడు ఇద్దరినీ కలుపుతోంది. ఈ సాన్నిహిత్యాన్ని ఏ విధంగా అయినా ట్విస్ట్ చేయగల సామర్ధ్యం గంటా శ్రీనివాస్ కు ఉంది. మరి దాన్ని అడ్డుకోవడానికి అవంతి వద్ద ఉన్న అస్త్రాలు ఏంటి అన్నదే చూడాలి.

# సినిమాస్కోప్

## మరువలేని సంతకం.. తిరిగిరాని జ్ఞాపకం!




ఆమె అందానికి యువతరం దాసోహమైంది.. ఆమె అభినయానికి ప్రేక్షక లోకం నీరాజనం అర్పించింది.. ఆమె కోసం హీరోలు ఎదురు చూశారు.. ఆమె కోసం దర్శక నిర్మాతలు సినిమాలు వాయిదాలు వేసుకున్నారు.. ముందు దక్షిణాదిన.. తర్వాత ఉత్తరాదిన.. మొత్తంగా ఇండియన్ సెల్యులాయిడ్ పైనే తిరుగులేని చెరిగిపోని సంతకం చేసింది. ఆమే.. దివి నుంచి భువికి దిగివచ్చిన అతిలోక సుందరి శ్రీదేవి. తన సినిమా పాత్రలతో ప్రేక్షకులను ఎంతగానో అలరించిన శ్రీదేవి.. నిజ జీవిత పాత్రను మాత్రం అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారు. నేడు ఆమె వర్ధంతి సందర్భంగా శ్రీదేవి జీవిత విశేషాలను ఓసారి గుర్తు చేసుకుందాం. తన అందంతో.. అభినయంతో ఎన్నో ఆబాలగోపాలాన్ని అలరించిన శ్రీదేవి.. తమిళనాడులో జన్మించారు. 1963 ఆగస్టు 13న శివకాశి ప్రాంతంలో పుట్టారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టుగా చిన్నతనంలోనే సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. శ్రీదేవికి నాలుగేళ్ల వయసులో నే సినీ పరిశ్రమకు పరిచయం అయ్యారు. 'కందన్ కరుణయ్' అనే తమిళ సినిమాలో ఆమె బాలనటిగా నటించారు. ఆ తర్వాత.. పదేళ్లకే సినిమా ఛాన్సులు క్యూ కట్టాయి. యుక్తవయసు వచ్చే నాటికి బిజీ హీరోయిన్ గా మారిపోయింది. 1976లో హీరోయిన్ గా తొలి సినిమా చేసింది శ్రీదేవి. కె.బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన 'ముంద్రముదచ్చు' మూవీలో రజనీకాంత్ కమల్ హాసన్ సరసన నటించింది. ఈ సినిమాలో శ్రీదేవి నటనకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత వరుస ఆఫర్లు వచ్చాయి. అయితే.. తమిళనాట కమల్ హాసన్ తోనే ఎక్కువ సినిమాలు చేశారు శ్రీదేవి. వీరి జోడి హిట్ పెయిర్ గా నిలిచింది. ఆ విధంగా 1975–85 ప్రాంతంలో తమిళ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది శ్రీదేవి. అయితే.. తెలుగు సినీ పరిశ్రమలోకి మాత్రం 1977 లో 'మా బంగారక్క' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'పదహారేళ్ల వయసు' సినిమా శ్రీదేవిని టాప్ స్టార్ గా నిలబెట్టింది. 'పదునారు వయదినిలై' పేరుతో తమిళ్ లో తీసిన ఈ మూవీ భారీ హిట్ కొట్టింది. ఇదే సినిమాను తెలుగులో రీమేక్ చేశారు. ఈ సినిమాలో 'సిరిమల్లెపూవా..' అంటూ సాగిన శ్రీదేవి పాటకు యూత్ ఫిదా అయిపోయింది. ఆ విధంగా యువత కలల రాణిగా మారిపోయింది. ఆ తర్వాత టాలీవుడ్లో అగ్ర హీరోలందరితో నటించింది. ఎన్టీఆర్ ఏఎన్ఆర్ కృష్ణ చిరంజీవి వంటి స్టార్ హీరోలతో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది శ్రీదేవి. ఎన్టీఆర్ తో వేటగాడు బొబ్బిలిపులి కొండవీటి సింహం సర్దార్ పాపారాయుడు ఏఎన్ ఆర్ తో ప్రేమాభిషేకం ముద్దుల కొడుకు బంగారు కానుక శ్రీరంగ నీతులు చిరంజీవితో జగదేకవీరుడు అతిలోక సుందరి ఎస్పీ పరశురాం నాగార్జునతో 'ఆఖరి పోరాటం' వెంకటేష్ తో 'క్షణక్షణం' వంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించి ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది శ్రీదేవి. తన అందచందాలతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. ఆ తర్వాత బాలీవుడ్ బాట పట్టిన శ్రీదేవి.. అక్కడ కూడా జెండా పాతింది. నవరసాలను కళ్లతోనే పలికించగల అరుదైన నటి శ్రీదేవి. ఆమె అభినయ కౌశలం ముందు అన్ని పాత్రలూ తలవంచాయంటే అతిశయోక్తి కాదు. భారతీయ సినీ వినీలాకాశంలో ఆమెది ఎన్నటికీ చెరిగిపోని అందం.. వెండితెరపై ఎప్పటికీ వన్నె తరగని అభినయం.. అందుకే.. ఆమె దివి నుంచి భువికి దిగివచ్చిన అతిలోక సుందరి అంటే.. అవును అంటూ అంగీకరించింది ప్రేక్షక లోకం. ఆ విధంగా భారతీయ చిత్ర పరిశ్రమతో ధ్రువతారలా వెలిగిన శ్రీదేవి.. 2018 ఫిబ్రవరి 24న దుబాయ్లో అర్ధాంతరంగా కన్నుమూశారు. ఆమె ఈ లోకంలో లేకపోయినప్పటికీ.. ఆమె జ్ఞాపకాలు మాత్రం ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచే ఉంటాయి.

## 'చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్'గా మారిన నాగ్.. మరింత యవ్వనంగా!



అక్కినేని నాగార్జున రోజురోజుకి మరింత యవ్వనంగా తయారవుతున్నాడు. ఎల్లప్పుడూ ఉత్సాహంగా కనిపించే నాగ్.. ఆరుపదుల వయసు మీదపడినా నిరంతరం వ్యాయామం వర్కౌట్స్ చేస్తూ సినిమాలకు అనుగుణంగా తనను మలుచుకుంటున్నాడు. నాగ్ ఎప్పటికప్పుడు కొత్తదనం కోసం ఆరాటపడే హీరోలలో ఒకరు. తెలుగు చిత్రపరిశ్రమలో ఉన్నటువంటి సీనియర్ హీరోలలో మోస్ట్ హ్యాండ్సమ్ హీరో నాగ్ అని చెప్పాల్సిందే. అయితే త్వరలో నాగ్ భారీ యాక్షన్ సినిమాతో అలరించేందుకు సిద్ధంగా ఉన్నాడు. పిఎస్వి గరుడవేగ మూవీతో స్టైలిష్ మేకర్ అనిపించుకున్న డైరెక్టర్ ప్రవీణ్ సత్తారు. గరుడవేగతో ఒకసారిగా తనలోని మరో యాంగిల్ బయటికి తీసాడు సక్సెస్ అయ్యాడు. ఎన్నడూ లేనివిధంగా ఆ సినిమాలో హీరో రాజశేఖర్ ను కొత్తగా చూపించాడు. ఇప్పుడు ప్రవీణ్ సినిమాలో పరిగెత్తడానికి నాగ్ వంతు వచ్చింది. నాగార్జునను ఈ సినిమాలో చాలా స్టైలిష్ గా చూపెందుకు స్క్రిప్ట్ కూడా రెడీ చేసాడట ప్రవీణ్. ప్రస్తుతం వీరిద్దరి కాంబినేషన్ మూవీ పై ఇండస్ట్రీలో పలువార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఇటీవలే షూట్ ప్రారంభించి నాగ్ ప్రవీణ్ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లారు. ఇప్పటికే నాగార్జునతో హై వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్ ప్లాన్ చేసాడట ప్రవీణ్. అలాగే యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాలో హైలైట్ కాబోతుందట. ప్రస్తుతం హైదరాబాద్ లో ఫస్ట్ షెడ్యూల్ షూట్ జరుపుకుంటుంది. ఈ సినిమాలో నాగ్ 45ఏళ్ళ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడు. ప్రస్తుతం ఆ పాత్రకోసం నాగ్ చాలా మేకోవర్ అయినట్లు సమాచారం. ఈ ఫస్ట్ యాక్షన్ షెడ్యూల్ తర్వాత.. ప్రవీణ్ నాగ్ ఇంటరెస్టింగ్ ఎపిసోడ్ షూట్ చేయడానికి గోవాకు వెళతారని తెలుస్తుంది. ఇప్పటికే నాగ్ వైల్డ్ డాగ్ మూవీ కంప్లీట్ చేసాడు. చూడాలి మరి నాగ్ ప్రవీణ్ ఎలాంటి మ్యాజిక్ చేయనున్నారో!

## పవర్ స్టార్ మూవీ నుండి మరో క్రేజీ అప్డేట్..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రీఎంట్రీ కోసం అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఏప్రిల్ 9 డేట్ వస్తుందా.. అభిమాన హీరో సినిమా ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ కాసుకొని కూర్చున్నారు. పవర్ స్టార్ మూడేళ్ల విరామం తర్వాత వకీల్ సాబ్ సినిమాతో రీఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే టీజర్ తో ఫుల్ కిక్ ఇచ్చాడు పవన్. ఇదిలా ఉండగా ప్రస్తుతం పవన్ క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ దర్శకత్వంలో పీరియడిక్ సినిమా చేస్తున్నాడు. చారిత్రాత్మక నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అయితే పవన్ కళ్యాణ్ సినిమా నుండి ఎలాంటి కొత్త న్యూస్ తెలిసినా అది అభిమానులకు పండగే అవుతోంది. తాజాగా క్రిష్ - పవన్ కాంబో సినిమా పై ఓ వార్త హల్చల్ చేస్తోంది. ఈ సినిమాలో ఓ సాంగ్ షూట్ చేసేశారట మేకర్స్. ఈ విషయాన్నీ ఇంత కాలం బయటికి రాకుండా గుట్టుగా ఉంచారు కానీ కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఇంట్రడక్షన్ సాంగ్ చాలా కిక్ ఇస్తుందని చెప్పడంతో సందడి మొదలైంది. దాదాపు రెండు వందల మందితో సూపర్ సాంగ్ ఒకటి షూట్ చేశారట. అదికూడా లాక్ డౌన్ ముందే షూట్ చేసి పెట్టేయడం గమనార్హం. ప్రస్తుతం గణేష్ మాస్టర్ కారణంగా పవన్ ఫ్యాన్స్ కు తీపికబురు అందిందని చెప్పాలి. కానీ ఇలా ముందే బయటపెట్టడంతో భారీ హైప్ క్రియేట్ అవ్వడమే గాక ఆ హైప్ సినిమాకు కూడా హెల్ప్ అవుతుందని మేకర్స్ సైలెంట్ అయినట్లు ఇండస్ట్రీ టాక్. మొత్తానికి ఈ సినిమాలో ఓ సాలిడ్ సాంగ్ ఉంది అనే విషయం పై అభిమానులకు క్లారిటీ వచ్చేసింది. ఇదిలా ఉండగా పవన్ ప్రస్తుతం ఈ సినిమానే కాకుండా అయ్యప్పనుమ్ కోషియం రీమేక్ లో కూడా నటిస్తున్నాడు.



## సర్కారు పాటలో మహేష్ మాస్ బీట్!




దూకుడు ఆగడు సినిమాల తర్వాత తమన్ మరోసారి మహేష్ సినిమాకు సంగీతం అందిస్తున్నా డు. వరుస బ్లాక్ బస్టర్ హిట్లలో ఉన్న హీరో మ్యూజిక్ డైరెక్టర్ ఇద్దరి నుండి ఈసారి ఎలాంటి ఆల్బమ్ రానుందో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు ఫ్యాన్స్. అయితే ఈ సినిమాలో ఓ మాస్ సాంగ్ ఉండబోతుందని ఆల్రెడీ సాంగ్ కంపోసింగ్ కూడా అయిపోయిందని టాక్. ఇంతలో కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ పేరు తెరమీదకు వచ్చింది. సరిలేరు నీకెవ్వరూ సినిమాలో మైండ్ బ్లాక్ అనే సాంగ్ తో ఊపేసిన శేఖర్.. ఈసారి కూడా సర్కారులో ఓ మాస్ సాంగ్ చేయనున్నట్లు సమాచా రం. ఇదివరకే శేఖర్ మాస్టర్ ఓ సాంగ్ చేస్తాడనే వార్తలు వచ్చా యి. ఇప్పుడు ఈ వార్త పుకార్లకు బలాన్ని అందినస్తుందని చెప్పాలి.

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం 'సర్కారు వారి పాట'తో అలరించేందుకు రెడీ అవుతున్నాడు. పరశురామ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కీర్తిసురేష్ ఫస్ట్ టైం మహేష్తో రొమాన్స్ చేయబోతుంది. గతేడాది సరిలేరు నీకెవ్వరూ సినిమాతో బాక్సాఫీస్ హిట్టు కొట్టిన మహేష్.. కొన్నేళ్లుగా అంటే శ్రీమంతుడు నుండి వరుస బ్లాక్ బస్టర్ హిట్లు కొడుతున్నాడు. వరుసగా భరత్ అనే నేను మహర్షి సరిలేరు నీకెవ్వరూ ఇలా తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం మహేష్ చేస్తున్న 'సర్కారు వారి పాట' సినిమా పై అభిమానులలో ఇప్పటికే అంచనాలు భారీస్థాయికి చేరుకున్నాయి. టైటిల్ దగ్గర నుండి మోషన్ పోస్టర్ వరకు అన్ని ఈ సినిమా పై మరింత హైప్ క్రియేట్ చేసూ _నే ఉన్నాయి. అయితే పరశురామ్ ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న ఈ సర్కారు మూ వీ.. మహేష్ అభిమానులకు పక్కా ట్రీట్ ఇవ్వనుందని నమ్మకంగా ఉంది చిత్ర బృందం. ఇదిలా ఉండగా

## తండ్రితో మెగాబ్యూటీ.. నువ్వెందుకు ఇంత క్యూటీ..? సోషల్ మీడియాలో వైరల్!

చూడగానే ఆకట్టుకునే అందమైన ఆ'కృతి' ఆమె సొంతం.. కళ్లతోనే భావాలు పలికించే కెపాసిటీ కూడా ఆ బ్యూటీ అసెట్.. ఈ రెండు అస్త్రాలతో టాలీవుడ్ లోకి ప్రవేశించిన కృతిశెట్టి.. ఇప్పుడు పెద్ద ఉప్పెనే క్రియేట్ చేస్తోంది! తొలి సినిమాతోనే యువత మనసు దోచిన ఈ చిన్నది.. 'ఉప్పెన' భారీ సక్సెస్ తో జోరు చూపిస్తోంది. తొలి సినిమా విజయంతో వరుస అవకాశాలు సొంతం చేసుకుంటున్న కృతి.. ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా భారీగా పెంచుకుంటోంది. ఈ క్రమంలో ఈ బ్యూటీ చిన్ననాటి క్యూట్ ఫొటోను వెతికి పట్టేశారు ఫ్యాన్స్. మంగళూరుకి చెందిన ఈ బ్యూటీ గతేడాది 'ఫాదర్స్ డే' రోజున ఈ ఫొటోను షేర్ చేసింది. అప్పట్లో ఈ అమ్మడి గురించి ఇంకా జనాలకు తెలియలేదు కాబట్టి ఈ ఫొటో వెలుగులోకి రాలేదు. ఇప్పుడు మాత్రం.. సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. తండ్రి పక్కన నిలబడి స్మైల్ ఇస్తున్న ఈ అమ్మడు అప్పటి నుంచే క్యూట్ గా ఉంది. దీంతో.. 'స్వీటీ.. నువ్వెందుకింత క్యూటీ' అని పాట పాడేస్తున్నారు యూత్. కాగా.. 'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీ హిట్ సొంతం చేసుకున్న ఈ కన్నడ సోయగం.. భారీ ఆఫర్లతో గాల్లో తేలిపోతోంది. ప్రస్తుతం నాని 'శ్యామ్ సింగరాయ్'లో నటిస్తున్న కృతి.. ఇంకా పేరు పెట్టని సుధీర్ బాబు సినిమాకు కూడా సైన్ చేసింది.





## జాన్వీ వర్సెస్ రూహీ.. వ్వావ్ వ్వాటే లుక్!

చందనమే పచ్చదనమే! పచ్చిక బయలు పచ్చదనమే!! ఎదకు సమ్మతం చెలిమే...!! స్వరమాంత్రికుడు ఏ.ఆర్.రెహమాన్ సృజనలోంచి పుట్టుకొచ్చిన బాణి ఇది. ఇదిగో ఇక్కడ జాన్వీ కపూర్ ఆ బాణీకి తగ్గట్టే డిజైనర్ లుక్ తో అదిరే స్టైల్లో దర్శనమిచ్చింది. చిలుకాకుపచ్చ డిజైనర్ డ్రెస్ లో తళుకుబెళుకులు ప్రదర్శిస్తున్న జాన్వీని చూస్తుంటే నేటిరం ఫ్యాషనిస్టాగా ఏ స్థాయిని అందుకుందో అర్థమవుతోంది అంటూ అభిమానులు ఫిదా అయిపోతున్నారు. కపూర్ ఫ్యామిలీ నుంచి సోనమ్ కపూర్ తర్వాత ఆ లెగసీని నడిపించేస్తున్న కుర్రబ్యూటీగా జాన్వీకి కితాబు దక్కుతోంది. చిట్టి పొట్టి నిక్కరులో కనిపించినా.. బికినీ స్విమ్ సూట్ లో చిలౌట్ చేసినా.. ఇలా అల్ట్రా మోడ్రన్ డిజైనర్ లుక్ తో దర్శనమిచ్చినా జాన్వీ తనదైన ప్రత్యేకతను ఎలివేట్ చేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటో యువతరంలో వైరల్ గా మారింది. జాన్వీ నటించిన రూహీ అఫ్జానా త్వరలో రిలీజ్ కి రానుంది. డే వన్ ప్రచారంలో భాగంగా జాన్వీ ఇలా ఫోటోషూట్ తో బరిలో దిగింది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ ఆకట్టుకుంది. కార్తీక్ ఆర్యన్ తో దోస్తానా 2 సెట్స్ పై ఉంది. ఇటీవల గుడ్ లక్ జెర్రీ అనే చిత్రానికి సంతకం చేసింది.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed at Unyted Publications from H.no.# 5+-61-3,Rajendra Nagar,Seethampeta,Visakhapatnam-16,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16, Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com